# ప్రభాత సమాచారం

ఆదిలాబాద్ Digital Edition

https: epaper.prabhathasamacharam.com

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం | 23 అక్టోబర్ 2025 | ■ 13 పేజీలు



9

## తెలంగాణ గ్రామీణ బ్యాంకులో చోరీకి యత్నం


12

# తనిఖీలకు మంగళం ?

## చెక్ పోస్టుల మూసివేతకు రవాణా శాఖ కమిషనర్ ఉత్తర్వులు

- ■ జాతీయ రహదారులపై చెక్‌పోస్టుల తొలగింపు
- ■ అధికారికంగా మూసివేత..
- ■ రికార్డులు, సామగ్రి జిల్లా కేంద్రానికి తరలింపు...
- ■ 2014లో ప్రారంభం.. 2025లో ఎత్తివేత
- ■ అవినీతి ఆరోపణలే ప్రధాన కారణం
- ■ సాయంత్రానికి తట్టా బుట్ట సర్దిన అధికారులు




ఆయా రాష్ట్రాల మధ్య జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ప్రభుత్వం ఎత్తేసింది. నియమ నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా వస్తువులు, ఆహారధాన్యాలు, ఇతర ప్రమాదకర మత్తు పదార్థాలు, మద్యం సరఫరాకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో దశాబ్దం కింద వాటిని ఏర్పాటుచేశారు. కాగా, ఆ చెక్ పోస్టులు కేవలం కలెక్షన్ కేంద్రాలుగా మారిన అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీంతో వాటిని తక్షణమే మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న చెక్ పోస్టులు ఎట్టకేలకు మూత పడ్డాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చెక్ పోస్టులలోనే కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టుల వల్ల ప్రభుత్వానికి ప్రయోజనం లేకపోగా అధికారులు, ప్రైవేటు వ్యక్తులు పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారనే విషయాలు స్పష్టం అయ్యాయి. ఈ కారణంగానే చెక్ పోస్టులను వెంటనే తొలగించాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ కావడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సంబంధిత రవాణాశాఖ అధికారులు, సిబ్బంది చెక్ పోస్టులను ఎత్తివేశారు. ఆయా చెక్ పోస్టుల వద్ద ఉన్న ఫర్నీచర్, రికార్డులను ప్రత్యేక వాహనాలలో ఆయా జిల్లాల ఆర్టీవో కార్యాలయాలకు తరలించారు. చెక్ పోస్టులను తొలగించడంతో సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది.




13

### పోలీసుల ఆధ్వర్యంలో

## మెగా రక్తదాన శిబిరం

- ■ రక్తదాన శిబిరానికి భారీ స్పందన ■ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- ■ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా పోలీసుల మెగా రక్తదాన శిబిరం..
- ■ రక్తదానం చేసిన 817 మంది ■ రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన జిల్లా ఎస్పీ
- ■ అత్యవసరమైన సమయంలో ప్రాణాలను కాపాడేది రక్తదానం మహోన్నతమైనది

### ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

## ఆరోగ్య పరిస్థితి విషమం

### హుటాహుటిన కోయంబత్తూర్ తరలింపు

మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్య పరిస్థితి విషమించినట్లు తెలుస్తోంది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే తాజాగా ఆయన పరిస్థితి విషమించడంతో బుధవారం సాయంత్రం హుటాహుటిన కోయంబత్తూర్ తరలించినట్లు తెలుస్తోంది. 7లో




6

## సేంద్రియ ఎరువులను వాడాలి

- ■ శ్యాంపూర్‌లో సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ■ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు ■ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కేంద్రాల్లో విక్రయించాలి

రైతులు అందరూ రసాయన ఎరువులను వాడకుండా సేంద్రీయ ఎరువులు వాడకం ద్వారా పంటలు నాణ్యత ఉండటంతో పాటు భూమి సాంద్రత పెరుగుతుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్ రైతు వేదికలో ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం ఆధ్వర్యంలో సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జు పటేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజల కోసం ప్రభుత్వం ఉందని.. సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని, రైతులు పంటల రక్షణ కోసం, అధిక దిగుబడులకు మోతాదుకు మించి ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడడం వల్ల భూసారం కోల్పోయి నష్టపోతున్నారన్నారు. రైతులు సేంద్రియ ఎరువుల వాడకంతో భూముల సారం పెరుగుతుందన్నారు. అంతకుముందు రైతు వేదిక వద్ద కొమురం భీం జయంతి సందర్భంగా కొమురం భీమ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

# విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్








**నెన్నెల, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యాలయం పరిధిలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థినులకు ఫిజిక్స్ సబ్జెక్టులో పలు అంశాలను బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. తహసిల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి హై లతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, మండల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన పురోగతిని పరిశీలించి రికార్డులను సరి చూసి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ రకాల ధ్రువ పత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో చేపట్టిన మూత్రశాలల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని, ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, నిత్యవసర సరుకులు నిల్వ చేసే గదిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వంట సమయంలో పారిశుద్ధ్య నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## కిసాన్ కాపాస్ యాప్‌పై అవగాహన

**ఆసిఫాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
కిసాన్ కాపాస్ యాప్‌పై బుధవారం మండలంలోని మోతుగూడెం గ్రామంలో ఏఈఓ రెహమాన్ కిసాన్ కాపాస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిని అమ్ముకునే రైతులు తప్పనిసరిగా కిసాన్ కాపాసియాలో స్లాట్ బుకింగ్ చేసుకున్న తర్వాతనే తమ పత్తిని సంబంధిత సీసీఐ జిన్నింగ్ మిల్లుకు తీసుకువెళ్లాలని సూచించారు, కిసాన్ కాపాస్ యాప్ ద్వారా తమ పూర్తి వివరాలు యాప్‌లో పొందుపరిచి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్న సంబంధిత ఏఈఓను సంప్రదించవచ్చు అని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రభాకర్ వినోద్ అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## రాస్పల్లిలో పులి సంచారం

**కాగజ్‌నగర్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మండలంలోని రాస్పల్లి అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచారం కలకలం రేపింది. బుధవారం రాస్పల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పులి అడుగులను గుర్తించిన స్థానిక గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా, అవి పెద్ద పులి అడుగులేనని అధికారులు నిర్ధారించారు. పులి అడుగుజాడల ఆధారంగా అది వెళ్ళిన దారిని అధికారులు ట్రాకింగ్ చేస్తున్నారు. పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు, వ్యవసాయ కూలీలు ఒంటరిగా పనులకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు.



# పర్యాటకంపై విద్యార్థుల్లో అవగాహన అవసరం

## ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేసిన కలెక్టర్




**ఆదిలాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గత నెల 19న జరిగిన వ్యాసరచన, డ్రాయింగ్, ఉపోద్ఘాతం పోటీల విజేతలకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం బహుమతులు అందజేశారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధికి విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. పర్యాటక ప్రదేశాలను సందర్శించి, వాటి చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యాటకం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రకృతి సౌందర్యం, జలపాతాలు, గిరిజన సంస్కృతి, చారిత్రక ప్రదేశాలు పర్యాటక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. విద్యార్థులు ఈ సంపదను తెలుసుకొని ప్రపంచానికి పరిచయం చేసే దిశగా ఆలోచించాలని తెలిపారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక అధికారి రవికుమార్, గైడ్ లింగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం



## నదుల్లో స్నానం చేయడానికి వెళితే జాగ్రత్తగా ఉండాలి
## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

**చెన్నూర్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
గోదావరి నదిలో స్నానానికి వెళ్లి మృతి చెందిన శ్రీశైలంకుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కార్మిక, గనుల శాఖమంత్రి వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రొయ్యలపల్లీ గ్రామానికి చెందిన యువకుడు సోమవారం గోదావరిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతై మృతి చెందాడు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శ్రీశైలం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించగా స్థానిక ఎమ్మెల్యే మంత్రి మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జరిగిన సంఘటన చాలా దారుణం అని మృతుని కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందించడానికి కృషి చేస్తానని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి సంఘటనలు గతంలో కూడా జరిగాయని ప్రజలు నదుల్లో స్నానం చేయడానికి వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలని, సమూహంగా మాత్రమే వెళ్లాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

## గుడుంబా నిషేధానికి
# గ్రామస్తులు ప్రతిజ్ఞ

**దహెగాం, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని కర్జీ గ్రామంలో గుడుంబా నాటుసారా నిషేధిస్తూ గ్రామస్తులు బుధవారం ప్రతిజ్ఞ చేశారు. నాటుసారా, గుడుంబాకు బానిసైన కుటుంబాల్లో సుఖశాంతులు కరువైయ్యాయన్నారు. చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరు కుడా నాటుసారా. గుడుంబా తయారీ, విక్రయాలు, అక్రమ రవాణా చేయొద్దని లేకుంటే పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టిస్తామని హెచ్చరించారు.



# 1 నుంచి పత్తి కొనుగోలు ప్రారంభం

■ పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి ■ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నవంబర్ 1 నుంచి పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నస్పూర్ లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం సిసిఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద కనీస మద్దతు ధర చెల్లించి పత్తి కొనుగోలు చేస్తుందని తెలిపారు.**



**మంచిర్యాల, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో నవంబర్ 1వ తేదీ నుండి పత్తి కొనుగోలు చేపట్టనున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మంచిర్యాల మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యం లతో కలిసి సి. సి. ఐ. అధికారులు, జిన్నింగ్ మిల్లుల నిర్వహకులతో పత్తి కొనుగోలు అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సిసిఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి కనీస మద్దతు ధర చెల్లించి పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు దళారులకు పత్తిని విక్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలలో విక్రయించి కనీస మద్దతు ధరతో లబ్ధి పొందాలని తెలిపారు. 2025- 26 సంవత్సరంలో కనీస మద్దతు ధర క్రింద సి.సి.ఐ. కు పత్తి విక్రయించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్ లో రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని, పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం పత్తిలో తేమ 12 శాతం కంటే తక్కువగా ఉండాలని, నాణ్యతలేని /రంగు మారిన/ వర్షానికి తడిసిన పత్తిని కొనుగోలు చేయడం జరగదని, రైతులు విక్రయించేందుకు విడి పత్తిని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. ఆధార్ ప్రామాణికరణ జరిగిన తరువాతనే పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు తమ ఆధార్ కార్డులో వేలిముద్ర, కంటి స్కాన్, మొబైల్ నెంబర్ అనుసంధానం నవీకరణ చేసుకోవాలని తెలిపారు. ఆధార్ నంబర్ కు అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాలో మాత్రమే చెల్లింపులు జరుగుతాయని, ఆధార్ కార్డులో ఫోటో కలిగి ఉన్న రైతు మాత్రమే తక్పట్టిలో ఫోటో దిగాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్ డేటా ప్రకారం ధ్రువీకరణ చేయాలని, పత్తిలో తేమ శాతం, కనీస మద్దతు ధర, నిబంధనలు తెలిసేలా గ్రామాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి పత్తి జిల్లాలోకి రాకుండా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా సి.సి.ఐ. కేంద్రాలలో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులు కొనుగోలు చేసిన పత్తిని కొనుగోలు కేంద్రాలలోకి అనుమతించకూడదని తెలిపారు. రెవెన్యూ అధికారి, మండల వ్యవసాయ అధికారి, పోలీస్ అధికారులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియపై పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



---



## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**మంచిర్యాల, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

వాహనాదరులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని భీమిని ఎస్.ఐ విజయ్ కుమార్ అన్నారు. గురువారం మండల పోలీస్ స్టేషన్ ఆవరణలో వహనాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్క వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదు అన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం మూలంగా ప్రమాదాలకు గురై కుటుంబం రోడ్డున పడే పరిస్థితులు చోటు చేసుకుంటాయన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. వాహనం పై ముగ్గురిని ఎక్కించి త్రిబుల్ రైడ్ చేస్తే భారీ జరిమానాతో పాటు క్రిమినల్ కేసునమోదు చేస్తారన్నారు. వాహనాల్లో ఎక్కిన మహిళలపై మర్యాదగా ప్రవర్తించాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించి వారి గమ్యస్థానాలకు చేర్పించాలన్నారు. టాటా ఏసీ ఆటోలలో సౌండ్ సిస్టం అమర్చి ఇష్టారీతిన వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

---

## ఆదివాసి గ్రామాల్లో ముగిసిన దండారి ఉత్సవాలు

**ఇంద్రవెల్లి, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

ఆదివాసి గ్రామాల్లో గుస్సాడీ, దండారి ఉత్సవాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే దీపావళి పండుగకు దాదాపు 10 రోజుల మంది భోగీ పూజలతో దండారి ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయి. కొలబోడీ పూజలతో మండల పరిధిలోని డోంగర్ గావ్, కేస్లాపూర్ వంటి ఆదివాసీ గ్రామాల్లో గుస్సాడీ దండారి ఉత్సవాలకు ముగింపు పలికారు. ప్రతి గ్రామంలో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయ వాయిద్యాలు, చాచోయ్, నృత్యం, కోలాటం, రేల పాటలు ప్రత్యేక గుస్సాడి వేషధారణతో ఆట పాటలతో కొనసాగాయి. ఈ వేడుకలకు ఆదివాసీ గోండు సంప్రదాయ పూజలు చేసి ముగింపు పలికారు. గ్రామ శివారులో ఉన్న ఇప్ప చెట్టు కింద ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ముగించారు. ఈ కార్యక్రమంలో పెందుర్ బాదు పటేల్, అర్క సెడ్మారావ్, పెందుర్ భీంజీ, రాము భీర్సావ్ తదితరులు పాల్గొన్నారు.



---

## కొమురం భీం పోరాటం స్ఫూర్తిదాయకం

### జిల్లా నాయక్ పోడ్‌అధ్యక్షులు శంకర్



**సారంగాపూర్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

కొమురం భీమ్ పోరాటం స్ఫూర్తిదాయకం అని జిల్లా నాయక్ పోడ్ సంఘం అధ్యక్షుడు పోతుండ్ల శంకర్ అన్నారు. బుదవారం మండల కేంద్రంలో ఆదివాసీ నాయక్ పోడ్ ఆద్వర్యంలో కొమరం భీమ్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సందర్భంగా కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు అనంతరం వారు మాట్లాడారు. కొమరం భీమ్ జల్, జంగల్, జమీన్ నినాదంతో గిరిజనుల హక్కుల కోసం పోరాడిన యోధుడు ఆయన పోరాటం ఆదివాసీ ప్రజల్లో ఉత్తేజాన్ని నింపిందని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ కౌన్సిలర్ పురడి శ్రీకాంత్, మండల నాయకులు ఎర్రం గంగన్న, తోట మల్లేష్, పరత్ గంగారాం, సాయన్న, బోసాని భోజన్న, మెట్టు భోజన్న తదితరులు పాల్గొన్నారు.

---



### ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌ను

## కలిసిన జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

**నిర్మల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కలువ సుజాతను బుధవారం హైదరాబాద్‌లో నిర్మల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆవిడ శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన మామిడి శ్రీధర్ ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని చైర్మన్‌గా తమకు సంపూర్ణ సహకారం అందించాలని కార్పొరేషన్ చైర్మన్లు కలిసి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

### ఎంబీబీఎస్ సీటు సాధించిన

## విద్యార్థినికి సన్మానం

**జన్నారం, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

మండలం లోని రోటిగూడ గ్రామానికి చెందిన పులిశెట్టి ఆశ్రుత నీట్ యూజీ పరీక్షలో , అత్యుత్తమ ర్యాంకు సాధించి ఫ్రీ ఎంబిబిఎస్ సీటు పొందిన సందర్భంగా, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శివశక్తి సామాజిక సంక్షేమ సంస్థ, రోటిగూడ ఆధ్వర్యంలో ఘన సన్మానం సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ ఫౌండర్, పాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అశ్రుత ఎంబిబిఎస్ పూర్తి చేసి ఉద్యోగం సాధించి పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరుతున్నామన్నారు. గ్రామ ప్రజలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆశ్రుత యొక్క విజయం గ్రామానికి గర్వకారణమని, ఆమె కృషి ఇతర విద్యార్థులకు ప్రేరణ కావాలన్నారు. శివశక్తి సామాజిక సంక్షేమ సంస్థ అడ్మిన్ సేపురి గోపాల్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గ్రామస్తులు సత్యనారాయణ, మల్లే శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.



---

## నైపుణ్యా అభివృద్ధి శిక్షణకు ప్రతిపాదనల స్వీకరణ

**మంచిర్యాల, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని నిరుద్యోగ మైనారిటీ (ముస్లిం, బౌద్ధ, పార్సి, సిక్కు, జైన) యువకులకు తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆదేశాల మేరకు స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం కొరకు ప్రభుత్వ, ప్రసిద్ధ ప్రైవేట్ సంస్థల నుండి ప్రతిపాదనలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రొఫెషనల్, ఐ.టి. రంగాలలో నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అనుబంధమైన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ద్వారా ఉచిత శిక్షణ అందించబడుతుందని, ఇందు కొరకు ఆయా సంస్థల నుండి ప్రతిపాదనలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రతిపాదనల ద్వారా విద్యావంతులైన నిరుద్యోగ మైనారిటీ యువతకు ప్రస్తుత ఉద్యోగ మార్కెట్ లో అధిక డిమాండ్ ఉన్న రంగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఎంపికైన సంస్థలు శిక్షణ ఇవ్వడమే కాకుండా, శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించవలసి ఉంటుందని తెలిపారు. సంస్థ రిజిస్ట్రేషన్ / ఇన్ కార్పొరేషన్ సర్టిఫికెట్ వివరాలు, చిరునామా, సంప్రదింపు నెంబర్, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అనుబంధ సర్టిఫికెట్ (తప్పనిసరి), గత3 ఆర్థిక సంవత్సరాల ఆదాయ పన్ను రిటర్న్లు, ఆడిట్ నివేదికలు, గత 3 సంవత్సరాలలో అందించిన నైపుణ్య శిక్షణ ప్రదర్శన, కోర్సు పూర్తి చేసిన సర్టిఫికెట్లు / సంబంధిత ప్రభుత్వ (రాష్ట్ర/ కేంద్ర) సంస్థల ద్వారా జారీ చేయబడిన వర్క్ ఆర్డర్లు, తృతీయ పక్ష అంచనా నివేదిక – సంస్థ అందించిన శిక్షణ నాణ్యత పై ధ్రువీకరణ, సంస్థ అందించిన శిక్షణల విజయ గాథలు – ఫోటోలు, గత సంవత్సరంలో ఉపాధి కల్పించిన రికార్డులు/ బ్యాంకు స్టేట్మెంట్లు, జిల్లాలో ఉన్న శిక్షణ కేంద్రాల వివరాలు, పనిచేస్తున్న సిబ్బంది అర్హతల జాబితా వివరాలతో శిక్షణ సంస్థలు తమ ప్రతిపాదనలను జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత కార్యాలయంలోని ఎఫ్–5లోని జిల్లా అల్పసంఖ్యాక సంక్షేమ శాఖ కార్యాలయంలో నవంబర్ 6వ తేదీలోగా సమర్పించాలని ఈ సందర్భంగా తెలిపారు.



# ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులు వేగిరం చేయాలి

■ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు నాణ్యతతో చేపట్టాలి ■ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ గ్రామీణ మండలంలోని నాగ్నాయిపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనం పనులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భవన నమూనా మ్యాపులను పరిశీలించి, అవసరమైన సవరణలపై సూచనలు చేశారు. భవన నిర్మాణం నాణ్యవంతంగా, సమయానికి పూర్తి కావాలని, సరిపడినంతమంది కూలీలను నియమించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ప్రదేశం కేటాయించాలన్నారు. భవనం చుట్టూ హద్దుల గుర్తులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందిరా మహిళా శక్తి భవనాలు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతను పెంపొందించేందుకు చేపట్టిన ప్రాధాన్యమైన కార్యక్రమమనికలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లో నాణ్యత పాటించాలి**

అనంతరం కలెక్టర్ పట్టణంలోని బంగాల్‌పేట్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చేందుకు 5 లక్షల రూపా యలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతోందని, పను లను నాణ్యవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. దశ లవారీగా నిధులు విడుదల చేయడం జరుగుతుందని, అధికారులు పర్యవేక్షణను క్రమం తప్పకుండా కొనసాగించాలని కలెక్టర్ అన్నారు. సంబంధిత అధికారులు నిత్యం పరిశీలించాలని ఆదేశించారు. నిరుపేద లబ్ధిదారుల తమ సొంత ఇంటి కలను నెరవేర్చినందుకు ప్రభుత్వానికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ చందు జాదవ్, డీఈ తుకారం రాథోడ్, ఏఈఈ చందన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు ప్రభాకర్, రాజు, ఎంపీడీవో గజానన్, హౌసింగ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## కుమ్రంభీం స్ఫూర్తితో అభివృద్ధి చేయాలి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
ఆదివాసి వీరుడు కుమ్రం భీం 125వ జయంతి జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ మాట్లాడుతూ, భీం పేరు రాజకీయ ప్రయోజనాల కోసం వాడడం మానుకుని, పోరు గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలను కోరారు. భీం ఆశయాలకు న్యాయం కావాలంటే రౌట సంకెనపల్లి సహా ఆదివాసి ప్రాంతాల్లో విద్య, వైద్యం, రవాణా రంగాలు అభివృద్ధి చెందాలని సూచించారు. ఆయన పేరుతో ఉన్న ప్రాజెక్టులు రైతులకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు గెడం టికానంద్, కార్తిక్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షుడు నిఖిల్ పాల్గొన్నారు.



## 24న ఉమ్మడి జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారుల సమావేశం



**మంచిర్యాల, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
ఈ నెల 24న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి ఎన్ఎన్ఎస్ ప్రోగ్రామ్ అధికారుల సమావేశం ఉంటుందని మంచిర్యాల జిల్లా జాతీయ సేవా పథకం కన్వీనర్ డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్ బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోనీ వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాలలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే ప్రతాప్ రెడ్డి, కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ నారాయణ వస్తున్నారని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారులు 2024 -25 సంవత్సరానికి గాను రెగ్యులర్ ఆక్టివిటీస్, స్పెషల్ క్యాంప్ లకు సంబంధించిన రిపోర్టును తీసుకురావాలని ఆయన కోరారు. 2025-26 సంవత్సరం యాక్షన్ ప్లాన్, వాలంటీర్స్ డాటాని సైతం తీసుకురావాలని సూచించారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ఆసిఫాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
మండలంలోని చిరకుంట గ్రామంలో అరిగెల లక్ష్మయ్య 33వ వర్ధంతి సందర్భంగా బుధవారం వారి కుమారులు అరిగెల నాగేశ్వరావు, మల్లికార్జున్, వేణుల ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా వారి కుమారులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి అనుభవజ్ఞులైన వైద్యులచే రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. ఈ వైద్య శిబిరంలో 100కు పైగా రోగులకు వైద్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అరిగెల నాగేశ్వరావు మాట్లాడుతూ తన తండ్రి లక్ష్మయ్య జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు ఉచిత వైద్యంతో పాటు మందులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు సుంకరి పెంటయ్య, నాయకులు గాజుల రాజేంద్రప్రసాద్, లచ్చన్న, శరత్, దీపక్ రావ్ పాల్గొన్నారు.



## తెలంగాణ తల్లి నిర్మాణ పనులు పరిశీలించిన కలెక్టర్

■ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ..
నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి
■ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహ పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. విగ్రహ నిర్మాణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన నమూనాలో, అత్యంత నాణ్యంగా తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన జరగాలన్నారు. నిర్ణీత గడువులోగా విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు సూర్యారావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు

**మంచిర్యాల, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14 హ్యాండ్ బాల్ బాల, బాలికల జిల్లా స్థాయి ఎంపిక పోటీలను పట్టణంలోని ట్రినిటీ హై స్కూల్‌లో బుధ వారం పోటీల కన్వీనర్, పాఠశాల కరెస్పాండెంట్ బిజు కురువిల్లా క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ ఎంపిక పోటీలకు జిల్లా నలు మూలల నుంచి 150 మంది క్రీడా కారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమీ డైరెక్టర్ జాన్ థామస్, జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ ఎండీ యాకూబ్, నిర్వాహక కార్యదర్శులు జునుగు రవి, రవీందర్, సౌమిత్, వ్యాయామ ఉపాధ్యాయులు పాశం శ్రీనివాస్, పున్నం, విఠల్, సాంబమూర్తి, కార్తీక్, రాజేందర్, వామన్, విశాల, దీపిక, క్రీడాకారులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
2024- 25 సంవత్సరం ఖరీఫ్, రబీ లకు సంబంధించి జిల్లాలోని రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. డెలివరీ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024- 25 సంవత్సరం ఖరీఫ్, రబీ లకు సంబంధించి జిల్లాలోని రైస్ మిల్లులకు కేటాయించిన సి.ఎం.ఆర్. డెలివరీ లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు, రైస్ మిల్లర్ల నిర్వాహకుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసుకుని 2025- 26 సంవత్సరం ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొరకు బ్యాంక్ గ్యారంటీలు, ఒప్పందాలు సమర్పించాలని తెలిపారు. లక్ష్యాలు పూర్తి చేయని డిఫాల్టర్ రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించడం జరగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.







# పోలీస్ అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో బుధవారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఫ్లాగ్ డే సందర్భంగా అమరవీరులను స్మరిస్తూ నిర్వహించిన ర్యాలీలో జిల్లా ఎప్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. ర్యాలీలో పోలీసు సిబ్బంది క్యాండిల్ని చేతున పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉండటానికి పోలీసుల పాత్ర మరువలేనిదన్నారు.

- జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహణ
- పాల్గొన్న400 మంది పోలీసు అధికారులు,సిబ్బంది
- ఫ్లాగ్‌డే సందర్భంగా అమరవీరులను స్మరిస్తూ ర్యాలీ
- అంబేద్కర్ చౌరస్తా వద్ద గల అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులు అర్పించిన ఎస్పీ, సిబ్బంది







**ఆదిలాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)** అమరవీరులను స్మరిస్తూ అక్టోబర్ 21 ఫ్లాగ్ డే సందర్భంగా బుధవారం సాయంత్రం 7:30 గంటలకు ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టర్ చౌరస్తానందు జిల్లా పోలీసులు, పట్టణ పోలీసు అధికారులు మరియు రెండవ బెటాలియన్ అధికారుల సమన్వయంతో క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించడం జరిగింది. ర్యాలీ లో ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది క్యాండిల్ ని చేతున పట్టుకొని అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగించారు. ప్రస్తుత జిల్లా ప్రశాంత వాతావరణంలో కొనసాగడానికి ఒకప్పటి పోలీసు అమరవీరుల త్యాగ ఫలితమే కారణమని గుర్తు చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అమరవీరుల చిత్ర పటాల వద్ద క్యాండిల్ ర్యాలీని ముగించి నివాళులర్పించడం జరిగింది. ర్యాలీ అంతట అమరవీరులను స్మరిస్తూ, వారి త్యాగాలను స్మరిస్తూ, జోహార్ జోహార్ అంటూ అమరవీరులకు నినాదాలు చేస్తూ కొనసాగింది, అంబేద్కర్ చౌరస్తానందు పూర్తయింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్, రెండవ బెటాలియన్ సిబ్బంది అధికారులు, పట్టణ సీఐలు ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

## ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



**సిర్పూర్ (టి), అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పనులను లబ్ధిదారులు 45 రోజులలోపు ప్రారంభించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మొదటి విడతలో మంజూరయిన 70 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు మంజూరయిన ప్రతి లబ్ధిదారుడు పనులు ప్రారంభించాలని చెప్పారు. లేని పక్షంలో మంజూరు పత్రాలు రద్దు అయి ఇతరులు అర్హులైన వారికి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలు ఇస్తుందన్నారు. అనంతరం ఎంపీడీవో ఆవరణలో గతంలో నిర్మించిన నమునా భవనంకు మరమ్మతులు చేసి గ్రంథాలయంను ప్రారంభించారు. మండల కేంద్రంలో గ్రంథాలయం లేక పోవడంతో పాఠకుల సౌకర్యార్థం గ్రంథాలయంను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం లోనవెల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద మంజూరు రూ.30 లక్షలతో లోనవెల్లి నుంచి పెన్‌గంగా వరకు, పారిగాం నుంచి పెన్‌గంగా వరకు రోడ్లు నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామానికి చెందిన బుద్ద బాలకిషన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఏఈ సజీయోద్దీన్, ఈవో తిరుపతి, బీజేపీ నాయకులు లావణ్య, అశోక్, ఆశోక్ ఆర్యా, సాయి, ప్రశాంత్, విలాస్, బాలాజీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి జాతీయ రహదారి పనుల విషయాన్ని తీసుకెళ్లామని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రితీమిలన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాగజ్‌నగర్ పట్టణ అభివృద్ధి కోసం కాగజ్‌నగర్ నుంచి నాగ్‌పూర్ వరకు నాలుగు వరసల జాతీయ రహదారి పనులకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభించేందుకు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### మద్యానికి బానిసై
# ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**నెన్నెల, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)** నెన్నెల మండలం కేంద్రంలో షేక్ యాకుబ్(25) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు మేరకు యాకుబ్ గత కొంతకాలంగా మద్యానికి బానిసై, నిత్యం భార్యతో గొడవలు పడేవాడన్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం అతిగా మద్యం సేవించి ఇంటి నుంచి వెళ్లి గ్రామ శివారులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### సైబర్ నేరాలపై
# అప్రమత్తంగా ఉండాలి

**నిర్మల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నిర్మల్ ఎస్పీ రాకేష్ మీనా తెలిపారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని వివిధ పోలీస్ స్టేషన్ లో పోలీసుల సంస్కరణ వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు సైబర్ నేరలపై అవగాహన కల్పించారు. ఎటువంటి ఇబ్బందులున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బీసీల మహాధర్నా విజయవంతం చేయండి



**జన్నారం, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)** 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకై బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్‌తో అక్టోబర్ 24 శుక్రవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద బీపీ "మహా ధర్నా" నిర్వహించబోతున్నారనీ బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ కాసెట్టి లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా (బీసీఐఎఫ్) మేధావుల ఫోరం చైర్మన్ మాజీ ఐఏఎస్ అధికారి టీ.చిరంజీవులు ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఈశ్వరయ్య వీరితో పాటు పెద్దలు విశారదన్ మహారాజు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ చంద్రయ్య , కో కన్వీనర్లు నరసయ్య, భాస్కర్ గౌడ్ మంచిర్యాల జిల్లా కన్వీనర్ లక్ష్మీనారాయణ ఖానాపూర్ నియోజకవర్గ కో కన్వీనర్ ఆంద్ర పురుషోత్తం, జన్నారం మండల బీసీ సంఘం అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.


### పోలీస్ స్టేషన్‌లో
# ఓపెన్ హౌస్ కార్యక్రమం

**సారంగాపూర్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)** పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా బుధవారం పోలీస్ స్టేషన్ లో ఎస్సై శ్రీకాంత్ విద్యార్థిని విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఉపయోగిస్తున్న టెక్నాలజీ గురించి, రిసెప్షన్, స్టేషన్ రైటర్, వి హెచ్ ఎఫ్ సెట్, టెలికాన్ఫరెన్స్, ఆన్ లైన్ ఎఫ్ఐఆర్, పార్టు మ్యాప్, ఆయుధాలు భద్రపరచు రూమ్, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్, మైనర్ డ్రైవింగ్ చేయవద్దని, మోటర్ వాహనాల చట్టాలవ్ వివిధ రకాల బందోబస్తు గురించి, విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, ఆకాష్, రవి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# బడుగు బలహీన ప్రజలకు అండగా ఉంటా

■ ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్
■ లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే




**కుభీర్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
ముధోల్ నియోజక వర్గంలో ఉన్న బడుగు బలహీన ప్రజలకు అండగా ఉండేందుకు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కుభీర్ లోని రైతు వేదికలో 101మంది కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కు ల మండల నాయకులతో కలసి పంపిణీ కార్యక్రమంలో పాల్గొని చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశం లో ఎమ్మెల్యే మాట్లాడుతూ..ముధోల్ నియోజక వర్గంలో ఉన్న అన్ని గ్రామాల అభివృద్ధి కి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. అదే విదంగా దక్షణ తెలంగాణా రాష్ట్రములో ఉన్న ప్రసిద్ధి గాంచిన బాసర సరస్వతి దేవస్థానానికి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని అన్నారు. దీంతో పాటు బాసర నుంచి మహూర్ వరకు రెండు వరసల రహదారి నిర్మించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రహదారి నిర్మించేందుకు ప్రణాళికలు చేపట్టడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్న పేద మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందె పథకాలు ప్రజలకు అందించేందుకు నవంతుగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్ బీజేపీ మండల అధ్యక్షులు ఏశాల దత్తాత్రి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బషీర్ బైంసా ఆత్మ కమిటీ చేర్మెన్ సిద్ధం వివేకానంద సీనియర్ నాయకులు సౌలి రమేష్ బంక బాబు యువ నాయకులు పురం శెట్టి రవికుమార్ మండల తహసీల్దార్ శివరాజ్ ఎంపీడీఓ సాగర్ రెడ్డి మండల నాయకులు కార్యకర్తలు కళ్యణ్ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.




## లారీ ఓనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

**ఆదిలాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
లారీ ఓనర్ల సమస్యల పరిష్కారానికి ధనవంతుగా కృషి చేస్తానని ఆదిలాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తేవాలన్నారు. అన్నివేళలా అండగా ఉంటానని వారికి శ్రీనివాసరెడ్డి భరోసా కల్పించారు.

## హోటల్లో అగ్నిప్రమాదం



**నిర్మల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని ఈద్గాం ప్రాంతంలో ఉన్న నక్షత్ర హోటల్లో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. హోటల్లో గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపుచేశారు. రూ.9 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు ఫైర్ అధికారి ప్రభాకర్ తెలిపారు.

## మద్యం దుకాణాల దరఖాస్తులకు నేడు లాస్ట్ డేట్

**ఆసిఫాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు ఈనెల 23తో ముగియనుంది. ఈసారి వెయ్యికి పైగా దరఖాస్తులు వస్తాయని ఆసిఫాబాద్ ఎక్సైజ్ అధికారులు అంచనా వేయగా, గడువు పొడిగించినా ఇప్పటివరకు కేవలం 622 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మరో రెండు రోజులు గడువు ఉండటంతో దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఏరియాలో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపడుతున్నాం

**బెల్లంపల్లి, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
ఇంటి పరిసరాలతో పాటు కాలనీని పరిశుభ్రంగా ఉంచుతున్న ప్రతి కుటుంబానికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. స్పెషల్ క్యాంపెయిన్ 5.0లో భాగంగా టీబీఓఏ క్లబ్ పరిసరాల్లో బుధవారం శ్రమదానం చేశారు. ఏరియాలో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపడుతున్నామని, ఉద్యోగ కుటుంబాలు ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలన్నారు.




# శనగ విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**ముథోల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రమైనా ముధోల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్‌లో భాగంగా ప్రదర్శన క్షేత్రం కొరకు యాసంగి పంట కోసం సబ్సిడీపై శనగ ఎన్ బిజిఈ 47 వెరైటీ విత్తనాలురైతులకు పంపిణీ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తానని అన్నారు. రైతుల అభివృద్ధి లక్ష్యంగా నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. డెమో సంచులు 270 వచ్చాయని సబ్సిడీ పోను రూ.1500 రూపాయలు అలాగే జనరల్ సంచులు360వచ్చాయని సబ్సిడీపోను సంచి ధర రూ. 1250 రూపాయలకు రైతులకు అందజేయడం జరుగుతుందని రచన తెలిపారు. అలాగే 8 కళ్యాణ లక్ష్మి చెక్కులను 9 షాదిముబారాక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, తాసిల్దార్ శ్రీలత ,ఎఓ రచన,ఆర్ఐ నారాయణ పటేల్ ,ఎఇఓలు ఋషికేష్, ప్రవీణ్, సందేశ్,రాణి, బిజెపి మండల అధ్యక్షులు కోరి పోతన్న, నర్సగౌడ్, సతీష్ రెడ్డి, రమేష్, జీవన్, సప్పటోళ్ల పోతన్న,ముత్యం రెడ్డి, మోహన్ యాదవ్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనహిత అన్నపూర్ణ ఆధ్వర్యంలో అన్నదానం



**బెల్లంపల్లి, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
బుధవారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్న దాన కార్యక్రమం 367వ సారి బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆదెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని ఆకలి తో ఉన్నవారి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని దాతల సహకారంతో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం ఉగాది సందర్భంగా ఏప్రిల్ 13 వ తేదీ 2021 న ప్రారంభించడం జరిగిందని దాతల సహకారంతో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ రోజు 367 వ సారి దాత కీ.శే. అడిచెర్ల రాంచెందర్ గారి జయంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు యాచకులకి, నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్న దాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమం లో సుమారు 180 మందికి ఒక పూట భోజనం అందించడం జరిగిందని ఈ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం విజయవంతం కొరకు మరింత మంది దాతలు ముందుకు రావాలని అలాగే సహాయ సహకారాలు అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు మరియు జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్ కుమార్, సహాయ కార్యదర్శి పంతంగి సంతోష్, కార్యవర్గ సభ్యులు నిచ్చకోల గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.



## సోఫీనగర్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

**నిర్మల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ పట్టణంలోని సోఫినగర్ కాలనీలో బుధవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో పేరుకుపోయిన చెత్తను కార్మికుల చేత తొలగింపజేశారు. కాలనీవాసులు తమ కాలనీలో డ్రైనేజీలను, రోడ్లను శుభ్రపరచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుంచి ప్రతిరోజు కాలనీలో పరిశుభ్రత చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు.

## కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన

**ముథోల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
మండలంలోని గన్నోర,రువ్వి గ్రామాలలో బుధవారం ఏఈవో రుషికేశ్ రైతులకు కపాస్ కిసాన్ యాప్ పై అవగాహన కల్పించారు. పత్తి రైతులకు సీసీఐ అందించే మద్దతు ధరను పొందేందుకు కపాస్ కిసాన్ యాప్ ను గురించి వివరించారు. ఈ యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేసుకుంటేనే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. పత్తి నాణ్యతను బట్టి క్వింటాలుకు రూ. 8110 వరకు మద్దతు ధర లభిస్తుందన్నారు.. రైతులు తమ సమీప సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించి మద్దతుధర పొందాలని, యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో రైతుల తదితరులు పాల్గొన్నారు.



# కుమ్రం భీం స్ఫూర్తితో పాలన అందించాం



ఆసిఫాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)

ఆదివాసీ యోధుడు.. తిరుగుబాటు వీరుడు.. గోండు బెబ్బులి కుమ్రం (కొమురం) భీమ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘన నివాళులర్పించారు. బీఆర్ఎస్ హయాంలో, కేసీఆర్ నేతృత్వంలో కుమ్రం భీమ్ ఇచ్చిన జల్, జంగల్, జమీన్ నినాదమే స్ఫూర్తిగా పాలన అందించామని గుర్తుచేశారు. వారి ఆశయాల సాధన దిశగా పయనించామని తెలిపారు. ఎస్టీ గురుకులాలు, కాలేజీల సంఖ్య పెంచడం, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందించడం, సీఎంఎస్టీఈఐ స్కీం ద్వారా గిరిజన బిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం.. కుమ్రం భీమ్ స్ఫూర్తిగా ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో ఆసిఫాబాద్ జిల్లాకు కుమ్రం భీమ్ పేరు పెట్టుకున్నందుకు, జోడేఘాట్‌లో సుందరమైన స్మృతి వనాన్ని ఏర్పాటు చేసినందుకు, హైదరాబాద్ మహానగరంలో కుమ్రం భీమ్ పేరిట ఆదివాసీ భవనాన్ని నిర్మించినందుకు గర్విస్తున్నామన్నారు. అస్తిత్వ పోరాటాలకు ప్రతీకగా నిలిచిన కుమ్రం భీమ్‌కు జోహార్లు అర్పిస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
కుమ్రంభీంకు ఘన నివాళి





ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

## ఆరోగ్య పరిస్థితి విషమం

### హుటాహుటిన కోయంబత్తూర్ తరలింపు

మంచిర్యాల, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)

మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్య పరిస్థితి విషమించినట్లు తెలుస్తోంది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆసుపత్రికి వెళ్లి వైద్యులతో మాట్లాడి, ప్రేమ్‌సాగర్ రావుఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ఆయన పరిస్థితి విషమించడంతో బుధవారం సాయంత్రం హుటాహుటిన కోయంబత్తూర్ తరలించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ వార్తలపై క్లారిటీ రావాలంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు కానీ, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కానీ అధికారికంగా ప్రకటించాల్సిన అవసరం ఉంది.

## ఉత్సాహభరితంగా క్రీడా పోటీలు



ఆసిఫాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)

స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్, ఖోఖో పోటీలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి పోటీలకు జట్టులను ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి దీపక్ తివారి, ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ వెంకటేష్ తెలిపారు.క్రీడలకు 300 మంది క్రీడాకారులు పాల్గొనగా  పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎసిఎంఓ  ఉద్ధవ్, క్రీడల అధికారి మడావి షేకు, ఏటీడీవో చిరంజీవి, క్రీడా పాఠశాల పిడి బండ మీనారెడ్డి, పిఈటిలు విద్యాసాగర్, కృష్ణమూర్తి, లక్ష్మణ్, సత్యనారాయణ, శారద ,హరీష్ ,యాదగిరి, సాయి, భవ్య, సరోజ, అరవింద్, రవి పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి

కోటపల్లి, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)

కోటపల్లి మండలం ఎదుల్ల బంధం గ్రామ ప్రాథమిక పాఠశాలలకు విద్యుత్ సరఫరా చేసే తీగ సపోర్టు వైరుకు విద్యుత్ ప్రసారం అవ్వడంతో, మేతకు వచ్చిన మూడు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బుధవారం పాఠశాలలకు విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన తీగ కు సపోర్ట్ వైరుగా ఇనుప వైరును ఉపయోగించారు. ఈ తీగ విద్యుత్ లైన్‌కు తాకి తెగి కిందపడటంతో శ్రీనివాస్, అంగరాజన్న, తిరుపతికి చెందిన గేదెలు మరణించాయి. అధికారులు పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరారు.



## విద్యారంగ అభివృద్ధి దిశగా చర్యలు

■ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ఆసిఫాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)

విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఇన్చార్జి విద్యాధికారి దీపక్ తివారి తెలిపారు. బుధవారం కెరమరి మండల కగోయగం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇందాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి రిజిస్టర్లు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఇన్చార్జి విద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



బెల్లంపల్లి, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)

మహిళలు, విద్యార్థులు ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీం సభ్యులు అవగాహన కల్పించారు. బుధవారం బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినిలకు భద్రత, ఆన్లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. యాంటీ డ్రగ్స్, ఎవరైనా చెడుగా మాట్లాడిన, ప్రవర్తించిన విద్యార్థులు తల్లిదండ్రులకు తెలపాలని సూచించారు. మహిళల భద్రత కోసం ప్రతిరోజు ప్రధాన చౌరస్తాలతో పాటు, జన సమీకరణ ప్రాంతాలు, కళాశాలలు, బస్టాండ్ లలో షీ టీం నిరంతరం నిఘా ఉంచుతుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థులు భయపడవద్దని, 63039 23700 నెంబర్ కు ఫోన్ చేసి తెలపాలని కోరారు. వివరాలు అందించిన వ్యక్తుల సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. కొంతమంది అత్యాశకు పోయి సైబర్ క్రైమ్, ఆన్లైన్ మోసాలకు, లోన్ యాప్స్ మోసాలకు గురవుతున్నారని వీటి జోలికి పోవద్దని సూచించారు. ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే వెంటనే 100 డయల్ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. షీ టీం సభ్యులు శ్రవణ్, దివ్య పాల్గొన్నారు.

## గాదిగూడలో పర్యటించిన ఎంపీ నగేష్

ఆదిలాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)

దిగూడ మండలంలోని పలు గ్రామాల్లో అదిలాబాద్ పార్లమెంటు సభ్యుడు నగేష్ బుధవారం సాయంత్రం పర్యటించారు. గ్రామానికి వచ్చి ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.





## కుమరం భీం ఆశయాల సాధనకు పాటుపడాలి

ఆసిఫాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)

గిరిజన తెగల హక్కులు, జల్‌జంగల్ జమీన్ కోసం పోరాడిన కుమరం భీం, ఎడ్లకొండు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లి గ్రామంలో బుధవారం కుమరం భీం, ఎడ్ల కొండు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని జెండా పూజ నిర్వహించారు. అనంతరం కుమరం భీం, ఎడ్లకొండు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన తెగల హక్కులు, జల్‌జంగల్ జమీన్ కోసం పోరాడిన కుమరం భీం, ఎడ్లకొండు ఆదర్శాలను ప్రస్తుత పాలకులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, నాయకులు అర్జుమాస్టర్, కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్రావు, బలరాం నాయక్, గుణవంతరావు, కుమరం భీం వారసులు వెంకటేష్, కుమరం రాము, కుమరం అంబరావు, పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

**కెరమెరి :** కెరమెరి మండలం జోడేఘాట్‌లో కుమరం భీం జయంతిని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు రాజేశ్వర్, మోతిరాం, దుందేరావు, మారు, మారుతి, గంగారాం, లక్ష్మణ్, బాగుబాయి, రేణుకా, జంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

**వాంకిడి :** జల్ జంగల్ జమీన్ కోసం పోరాడి అసువులు బాసిన గిరిజనుల ఆరాధ్య దైవం కుమరం భీం జయంతి సందర్భంగా గ్రంథాలయంలో పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అ?ధికారి సదానందం, సిబ్బంది పాల్గొన్నారు.

**బెజ్జూరు :** మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో బుధవారం కుమరం భీం చిత్రప టానికి పలువురు నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుష్పలత, నాయకులు తిరుప తి, సకారాం, శ్రీదేవి, అమృత, లలిత, నీలయ్య పాల్గొన్నారు.

**కౌటాల :** మండల కేంద్రంలో కుమరం భీం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య కుమరం భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ కాదు



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో గత కొన్ని రోజులుగా రూమర్డ్ జంటగా పేరు సొంతం చేసుకున్నారు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న. 'గీతాగోవిందం' సినిమాలో తొలిసారి కలిసి నటించిన ఈ జంట.. ఆ తర్వాత 'డియర్ కామ్రేడ్' సినిమా చేసి.. తమ పరిచయాన్ని కాస్త ప్రేమగా మార్చుకున్నట్లు సమాచారం. అప్పటినుంచి పలు వెకేషన్ లకి వెళ్లడం.. సినిమా పార్టీలకు హాజరవ్వడం.. పలు ప్రదేశాలలో తిరుగుతూ ఫోటోలకు ఫోజులిచ్చారు. కానీ ఎప్పుడూ కూడా తమ బంధాన్ని బయట పెట్టలేదు. ఇదిలా ఉండగా ఇటీవల విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నారు. కానీ ఈ విషయాన్ని కూడా అభిమానులతో పంచుకోలేదు. కానీ నిశ్చితార్థం తర్వాత విజయ్ దేవరకొండ పుట్టపర్తి సత్యసాయి మహా సమాధిని సందర్శించడానికి వెళ్ళినప్పుడు అక్కడి స్థానికులు ఆయనను గౌరవంగా ఆహ్వానించారు. ఆ సమయం లో కొన్ని ఫోటోలు బయటకు రాగా.. ఆయన చేతి వేలికి ఉన్న ఉంగరంతో నిశ్చితార్థ విషయం కాస్త నిజమయింది. అలాగే మొన్నామధ్య రష్మిక మందన్న షేర్ చేసిన కొన్ని ఫోటోల ద్వారా కూడా ఆమె చేతికి ఉన్న డైమండ్ ఉంగరం బయటపడింది. దీంతో వీళ్ళిద్దరూ నిశ్చితార్థం చేసుకున్నట్లు అటు అభిమానులే కాదు సినీ సెలబ్రిటీలలు కూడా నిర్ధారణకు వచ్చేశారు. ఇకపోతే ఈ జంట ఎప్పటికప్పుడు హింట్ ఇస్తున్నారే తప్ప తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించలేదు. ఇదిలా ఉండగా తాజాగా రష్మిక నటించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నవంబర్ 7వ తేదీన విడుదల కాబోతున్న నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించి ప్రమోషనల్ కార్యక్రమాలను చేపట్టారు చిత్ర బృందం. అందులో భాగంగానే ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన రాహుల్ రవీంద్రన్, రష్మిక మందన్న లను రాహుల్ రవీంద్రన్ భార్య, ప్రముఖ సింగర్, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి ఇంటర్వ్యూ చేశారు. అందులో భాగంగానే రష్మికను మీరు సింగిలే కదా అని రాహుల్ అడగడంతో ఆమె ఇచ్చిన సమాధానం అందరికీ ఒక క్లారిటీ వచ్చేసింది. అసలు విషయంలోకి వెళ్తే.. ది గర్ల్ ఫ్రెండ్ ప్రమోషన్స్ లో భాగంగా రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ.. "మీరు సింగిలే కదా అని రాహుల్ అడగగా.. మొదట సిగ్గు పడిపోయిన రష్మిక.. నవ్వుతూ నేను మంచి గర్ల్ ఫ్రెండ్ ని అంటూ చెప్పుకొచ్చింది. మొత్తానికైతే తాను సింగిల్ కాదని తాను కూడా రిలేషన్ లో ఉన్నానని ఈ విధంగా చెప్పేసింది రష్మిక. ఏది ఏమైనా రష్మిక.. విజయ్ దేవరకొండ రిలేషన్ ఇప్పుడు మళ్లీ వార్తల్లో నిలిచింది. ఇకపోతే ఈ జంట వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వివాహం చేసుకోబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కనీసం ఆ రోజైనా ఈ జంట అధికారికంగా ప్రకటిస్తారో లేదో తెలియాల్సి ఉంది. రష్మిక విషయానికి వస్తే.. ఇటీవల ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా విడుదల చేసిన చిత్రం థామా.. ఈ చిత్రంలో బేతాళ పాత్రలో అదరగొట్టేసింది రష్మిక. అక్టోబర్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా.. మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ది గర్ల్ ఫ్రెండ్ సినిమా విడుదలకు సిద్ధం కాబోతోంది.

# ప్రశాంత్ నీల్- ఎన్టీఆర్ మూవీ ఆగిపోయిందా?




యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం కేజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌తో జతకట్టారు. వీరిద్దరి కాంబోలో వస్తోన్న తొలి చిత్రం కావడంతో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాను ఎన్టీఆర్‌నీల్ వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో కాంతార బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అయితే తాజాగా ఈ పాన్ ఇండియా చిత్రంపై నెట్టింట కొన్ని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ ఆగిపోయిందని సోషల్ మీడియాలో ప్రచారం నడుస్తోంది. ఇప్పటికే మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంపై ఇలాంటి బ్యాడ్ న్యూస్ రావడం ఎన్టీఆర్ ఫ్యాన్స్‌ను నిరాశకు గురి చేస్తోంది. అయితే ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది. ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ మధ్య కంటెంట్ సృజనాత్మక విషయంలో విభేదాలు వచ్చాయని కొందరు అంటున్నారు. ఇప్పటివరకు వచ్చిన అవుట్‌పుట్ విషయంలో ఎన్టీఆర్ అసంతృప్తిగా ఉన్నారట. ఇద్దరి మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ రావడంతోనే ఈ మూవీ ఆగిపోయిందని నెట్టింట తెగ చర్చ నడుస్తోంది. అయితే ఈ విషయంపై ఎన్టీఆర్ కానీ.. డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కానీ ఇప్పటివరకు స్పందించలేదు. దీనిపై మేకర్స్ స్పందిస్తేనే క్లారిటీ రానుంది. కాగా.. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ మూవీకి డ్రాగన్ అనే టైటిల్ ఖరారైనట్లు తెలుస్తోంది. ఈ చిత్రం 2026 జూన్ 25న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని ఇప్పటికే వెల్లడించారు.

# కరుప్పు, నుంచి సాంగ్ రిలీజ్!



తమిళ నటుడు సూర్య రెట్రో మూవీ తర్వాత ఆర్జే బాలాజీ డైరెక్షన్లో కరుప్పు అనే మూవీతో మన ముందుకు రాబోతున్నారు. సూర్య నటించిన 45వ సినిమాగా తెరకెక్కుతున్న కరుప్పు మూవీ విడుదల తేదీ గురించి నిర్మాతలు ఇప్పటివరకు అఫీషియల్ గా వెల్లడించకపోయినప్పటికీ తాజాగా దీపావళి పండుగ సందర్భంగా కరుప్పు మూవీ నుండి మొదటి పాటను రిలీజ్ చేశారు.. తాజాగా "గాడ్ మోడ్" అనే పాటను రిలీజ్ చేశారు. నాలుగు నిమిషాల నిడివి గల ఈ ట్రాక్ సూర్య రోల్ ని పూర్తిగా గాడ్ మోడ్ లో చూపిస్తుంది. తమిళ జానపద మతంలో ఎక్కువగా పూజించబడే పవర్ ఫుల్ దేవుడు అయినటువంటి కరుప్పు స్వామి మానవ స్వరూపంగా ఈ పాటను ప్రదర్శించారు.తప్పు చేసిన వారికి ఈ దేవుడి పర్యవేక్షణలో స్థానం లేదు అని ఈ పాట చెబుతుంది.. ఇక ఈ పాట కోరస్ లో హీరో సూర్యను కరుప్పు స్వామి అని పిలుస్తారు.. అతని రాక ఎంతోమందికి చిరునవ్వులు తెప్పిస్తుందని, ఎంతోమంది ప్రజల హృదయాలను ప్రశాంత పరుస్తుందని ఈ పాట ద్వారా తెలిపారు.. తాజాగా విడుదలైన సూర్య కరుప్పు మూవీలోని పాట ఎంతోమంది అభిమానులను ఉత్సాహపరుస్తుంది..అలా తాజాగా విడుదలైన కరుప్పు సినిమాలోని గాడ్ మోడ్ పాటకి ఆయన అభిమానులు సోషల్ మీడియాలో ఆసక్తికరమైన పోస్టులు పెడుతున్నారు. ఆర్జె బాలాజీ డైరెక్షన్లో తెరకెక్కుతున్న కరుప్పు మూవీకి సంబంధించిన టీజర్ ని జూన్ ప్రారంభంలో నిర్మాతలు రిలీజ్ చేశారు. ఈ టీజర్ లో సూర్య బ్లాక్ కలర్ షర్ట్ , వైట్ కలర్ ధోతి ధరించి పవర్ ప్యాక్డ్ అవతారంలో కనిపించారు. అలాగే ఈ టీజర్ లో సూర్య న్యాయవాదిగా కోట్ ధరించినట్లు కూడా చూపించారు. ఇప్పటికే రెండు సినిమాలలో న్యాయవాది పాత్రలో మెరిసిన సూర్య ముచ్చటగా మూడోసారి కూడా కరుప్పు మూవీలో న్యాయవాది పాత్రలో కనిపించబోతున్నట్టు టీజర్ ద్వారా అర్థమైంది. ఈ సినిమాని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్ పై ఎస్.ఆర్. ప్రభు, ఎస్.ఆర్.ప్రకాష్ బాబు లు నిర్మిస్తున్నారు.ఇక ఈ మూవీలో సూర్య సరసన త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే యోగి బాబు, స్వతిక, శివదా,ఇంద్రన్స్, సుప్రీత్ రెడ్డిలు కీ రోల్స్ పోషిస్తున్నారు.ఈ సినిమాకి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు.అలా రెట్రో మూవీ ఫ్లాప్ తర్వాత సూర్య కరుప్పు మూవీతో మనల్ని అలరించబోతున్నారు. ఈ సినిమానే కాకుండా సూర్య , వెంకీ అట్లూరి డైరెక్షన్లో ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న సూర్య 46 అనే వర్కింగ్ టైటిల్ తో వస్తున్న మూవీలో కూడా నటిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ గా మమితా బైజు నటించగా.. రవీనా టాండన్, రాధిక శరత్ కుమార్ లు కీ రోల్స్ పోషిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కూడా శరవేగంగా జరుగుతుంది.

# సెంచరీకి చేరువలో డ్యూడ్..



డ్రాగన్ హీరో ప్రదీప్ రంగనాథన్ నటించిన తాజా చిత్రం డ్యూడ్కో లీవుడ్ హీరో నటించిన ఈ సినిమాకు తెలుగులోనూ రిలీజైంది. లవ్ టుడే, డ్రాగన్ చిత్రాలకు తెలుగు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపైనవీన్ ఎర్నేని,వై.రవిశంకర్ నిర్మించారు. ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 17న థియేటర్లలో విడుదలైంది. అయితే తొలి రోజు నుంచే ఈ మూవీకి పాజిటివ్ టాక్ రావడంతో వసూళ్ల పరంగా అదరగొట్టింది. మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 22 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. గతంలో రిలీజైన డ్రాగన్ కంటే ఎక్కువగానే వసూళ్లు రాబట్టింది. రిలీజైన నాలుగు రోజుల్లోనే రూ.83 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. ఐదు రోజుల్లోనే సెంచరీకి చేరువలోకి వచ్చేసింది. వరల్డ్ వైడ్‌గా ఐదు రోజుల్లో రూ.95 కోట్లకు పైగా కలెక్షన్స్ వసూలు చేసింది. ఈ విషయాన్ని మైత్రి మూవీ మేకర్స్ పోస్టర్ ద్వారా వెల్లడించింది. కాగా.. ఈ చిత్రంలో ప్రేమలు బ్యూటీ మమిత బైజు హీరోయిన్‌గా కనిపించగా.. ఆర్. శరత్‌కుమార్ కీలక పాత్రలో నటించారు.



# రిస్క్‌కు డిసైడైన జాన్వీ

ఎవరికైనా సక్సెస్, ఫెయిల్యూర్లు సహజం. అయితే సక్సెస్ ఎవరికైనా కిక్కిస్తే ఫెయిల్యూర్ మాత్రం చాలా డిజప్పాయింట్ చేస్తుంది. అయితే కొందరు మాత్రం ఫెయిల్యూర్ ను దృష్టిలో పెట్టుకుని, మళ్లీ అలాంటివి రాకుండా జాగ్రత్త పడితే, ఇంకొందరు మాత్రం ఫెయిల్యూర్ వచ్చినంత మాత్రాన దిగులు పడుతూ కూర్చుంటే ఎలా అని కెరీర్లో ముందుకెళ్తూ ఉంటారు. జాన్వీ కపూర్ ఇందులో ఆఖరి కోవలోకి వస్తుంది. అతిలోక సుందరి శ్రీదేవి కూతురిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన జాన్వీ, తక్కువ టైమ్ లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్ గా జాన్వీ నుంచి వచ్చిన పరమ్ సుందరి, సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి సినిమాలు బాక్సాఫీస్ వద్ద అనుకున్న ఫలితాల్ని అందుకోలేకపోయాయి. అయినప్పటికీ జాన్వీ కృంగి పోలేదు.ఆ సినిమాలు ఫ్లాప్ అయినా జాన్వీ మాత్రం తర్వాతి సినిమాను లైన్ లో పెట్టి అందరికీ షాకిచ్చింది. టైగర్ ష్రాఫ్, లక్ష్య ప్రధాన పాత్రల్లో కరణ్ జోహార్ నిర్మాణంలో ఓ కొత్త యాక్షన్ డ్రామాకు జాన్వీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే జాన్వీ ఈ సినిమా ఒప్పుకోవడానికి కారణం.. తాను కేవలం రొమాంటిక్ సినిమాలు మాత్రమే కాదు, ఏ జానర్ సినిమాలైనా చేయగలనని నిరూపించుకోవాలనుకోవడం. రాజ్ మెహతా దర్శకత్వంలో రానున్న ఈ సినిమా యాక్షన్, రివెంజ్, ఇంటెన్స్ డ్రామాతో రూపొందనుందని వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, ఈ మూవీలో జాన్వీకి చాలా స్ట్రాంగ్ రోల్ దక్కిందని, ఈ సినిమా ద్వారా తన ఎనర్జీ, ఎమోషన్, స్క్రీన్ ప్రెజెన్స్ ను మరింత బలంగా చూపించే అవకాశముందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఫ్యాన్స్ మాత్రం టైగర్ ష్రాఫ్, లక్ష్యతో జాన్వీ కెమిస్ట్రీ ఎలా ఉంటుందోనని డిస్కస్ చేసుకుంటున్నారు. రెండు ఫ్లాపుల తర్వాత జాన్వీ ఇలాంటి అడుగు వేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. ఇలాంటి సినిమాలు ఎంచుకుని, ఫ్లాపులు తన కెరీర్ ను డిసైడ్ చేయలేవని జాన్వీ నిరూపించుకోవాలని చూస్తుంది. అంతేకాదు, నటిగా కూడా తనను ఛాలెంజ్ చేసే సినిమాలను ఎంచుకోవాలని డిసైడై, అలాంటి క్యారెక్టర్లపైనే జాన్వీ ఫోకస్ చేసి రిస్క్ చేయడానికి కూడా జాన్వీ రెడీ అయిందని బాలీవుడ్ మీడియా వర్గాలంటున్నాయి. ఈ సినిమా సక్సెస్ అయితే ఇప్పటివరకు ఉన్న జాన్వీ క్రేజ్ మరో లెవెల్ కు వెళ్లడం ఖాయం. ఎవరైనా వరుస ఫ్లాపులు వచ్చినప్పుడు సేఫ్ ప్రాజెక్టులను సెలెక్ట్ చేసుకుని హిట్ అందుకోవాలని చూస్తారని, కానీ జాన్వీ మాత్రం భిన్నంగా ఆలోచించి తన సత్తా ఏంటో చాటాలని కసిగా ఉందని, ఏ నటికైనా ఇలాంటి లక్షణమే ఉండాలని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.



## కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన

**లక్షెట్టిపేట, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
ప్రత్తి కొనుగోలుకు నూతన విధానంలో భాగంగా కపాస్ కిసాన్ అనే యాప్ వినియోగించుకునే విధానంపై రైతులకు అగ్రికల్చర్ అధికారులు బుధవారం మండలంలోని దొడేపల్లి గ్రామ పంచాయతీలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నూతనంగా ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్ పోస్టర్స్ ను ఏఈఓ సాయిని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ... పత్తి రైతులు మీ యొక్క పాత మొబైల్ నెంబర్ లు పని చేయని యెడల ప్రస్తుతం ఆధార్ కు లింక్ ఉన్న కొత్త ఫోన్ నెంబర్ ను అందరూ మార్చుకోవాలని కపాస్ కిసాన్ అనే యాప్ ద్వారా రైతులు స్లాట్ బుక్ చేసుకొని సీసీఐ సెంటర్ లో ప్రత్తి విక్రయించాలన్నారు. రైతులు స్మార్ట్ ఫోన్‌లోని ప్లే స్టోర్ నుండి కపాస్ కిసాన్ అనే డౌన్‌లోడ్ చేసుకోవాలని, మధ్య దళారులకు అమ్మి మోసపోవద్దని అన్నారు. పత్తి విక్రయాలలో యాప్ వినియోగంలో సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కొత్త సుజాత, టెక్నీకల్ అసిస్టెంట్ బి. రాజన్న, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల వద్దకు కళాశాల సిబ్బంది

### హాజరు శాతం పెంచేందుకు ప్రయత్నాలు



**ఖానాపూర్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
ఖానాపూర్ మున్సిపల్ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు సిబ్బంది విద్యార్థుల చెంతకు వెళ్లారు. ఆ శాఖ ఆదేశాల మేరకు విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సిన అవసరం ఉండగా ఇక్కడ కళాశాల విద్యార్థులు పలు గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు తరగతులకు హాజరు కావడం లేదని, ఉపాధ్యాయుల బృందం స్వయంగా బుధవారం కళాశాల ప్రిన్సిపల్ ఆనందం ఆదేశాల మేరకు గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రతిరోజు కళాశాలకు పిల్లలను పంపించాలని కౌన్సిలింగ్ చేశారు.

## నిర్మల్‌లో కానిస్టేబుల్‌పై దాడికి యత్నం

**నిర్మల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
కానిస్టేబుల్‌పై దాడికి యత్నించిన ఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలో కలకలం సృష్టించింది. స్థానికుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రంలోని నగరేశ్వరవాడ ప్రాంతంలో బుధవార్పేటకు చెందిన అన్వర్ అనే యువకుడు మంగళవారం సాయంత్రం అనుమానాస్పదస్థితిలో ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. అక్కడే ఉన్న కానిస్టేబుల్ రహమాన్ అతడిని ఆపి వివరాలు అడిగారు. ఆగ్రహించిన అన్వర్ బ్లేడ్‌తో తనను తాను గాయపరుచుకున్నాడు. అనంతరం కానిస్టేబుల్ రహమాన్‌పై దాడికి యత్నించాడు. దీంతో కానిస్టేబుల్ సమీపంలోని ఇంట్లోకి వెళ్లి స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈలోపు అక్కడున్న పలువురు యువకులు అన్వర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు నిర్మల్ పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# తెలంగాణ గ్రామీణ బ్యాంకులో చోరీకి యత్నం

**ఆసిఫాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగుడు చోరీకి యత్నించాడు. బ్యాంకు కిటికి ఊచలను తొలగించి దుండగుడు బ్యాంకులోకి ప్రవేశించాడు. ముందుగా క్యాషియర్ క్యాబిన్‌లోని డ్రాలో డబ్బుల కోసం వెతకగా ఎలాంటి నగదు లభించలేదు. దీంతో అకౌంటెంట్ టేబుల్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న డ్రాలో వెతకగా ఫలితం లేక పోవడంతో నేరుగా మేనేజర్ గదిలోకి వెళ్లి అక్కడ ఉన్న సీసీ కెమరాల వైపును తొలగించి బ్యాంకు లాకర్ గది తాళం పగలగొట్టే ప్రయత్నం చేశారు. దాంతో బ్యాంకులో ఉనన సెక్యూరిటీ అలారం మోగడంతో పాటు మేనేజర్ సెల్‌కు సెక్యూరిటీ అలారం వచ్చింది. అప్రమత్తమైన మేనేజర్ శ్రీకాంత్, వెంటనే క్యాషియర్ ప్రసాద్‌ను అప్రమత్తం చేసి బ్యాంకు వద్దకు వెళ్లి గమనించాలని ఆదేశించారు. హుటాహుటిన ప్రసాద్ బ్యాంకు వద్దకు చేరుకోగా అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బ్యాంకు ఉత్తరం వైపున ఉన్న కిటికీ నుంచి బయటకు దూకి పారిపోయాడు. ప్రసాద్ 100 డయల్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచారం





అందించారు. వెంటనే పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. బ్యాంకు, పోలీసు సిబ్బంది బ్యాంకు షెటర్ తాళాలు తెరిచి బ్యాంకు లోపలికి వెళ్లి పరిశీలించారు. ఉత్తరం వైపు ఉన్న కిటికీ ఊచలు తొలగించి కిటికీ అద్దాలు పగలగొట్టి దొంగ బ్యాంకులోకి ప్రవేశించినట్లు గుర్తించారు. క్యాషియర్, అకౌంటెంట్‌తో పాటు మేనేజర్ గదులను పరిశీలించారు. లాకర్ తాళం పగలగొట్టే ప్రయత్నం చేసినప్పటికీ సెక్యూరిటీ అలారం మోగడంతో దొంగ పారిపోయినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ సంజయ్, ఎస్సై వెంకట కృష్ణలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దొంగ ఆచూకీ తెలుసుకునేందుకు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి వేలిముద్రలు, ఆధారాలను సేకరించారు. దొంగను పట్టుకునేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బ్యాంకులో డబ్బు గానీ, బంగారం గాని చోరీకి గురి కాలేదని మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

## ముగిసిన టాస్ వన్ ఫైలేరియా వ్యాధి నిర్ధారణ సర్వే



**లక్షెట్టిపేట, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
మండలంలోని వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈనెల 13 నుండి చేస్తున్న ఫైలేరియా వ్యాధి నిర్ధారణ టాస్ వన్ సర్వే బుధవారం నాటితో ముగిసిందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ... మండలంలోని ప్రజలందరికి 2021 నుండి 2023 వరకు వరుసగా మూడు సంవత్సరాల పాటు బోధకాల నివారణ మాత్రలను అందజేయడం జరిగిందన్నారు. నాలుగో విడుతల బోధకాలు వ్యాధి ఎలిమినేషన్‌లో భాగంగా వ్యాధి వ్యాప్తి ఏవిధంగా వుందో తెలుసుకోవడానికి టాస్ వన్ సర్వే నిర్వహించామని తెలిపారు. మండలంలోని వెంకట్రావుపేట, చందారం, మోదెల, ఇటిక్యాల నాలుగు గ్రామాలలో ఈ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ర్యాండమ్ గా 60 ఇళ్ళలోని 105 మందికి మొత్తం 240 ఇళ్ళలోని 420 మందికి ర్యాపిడ్ టెస్ట్ కిట్ ద్వారా ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతున్నామని సర్వే వివరాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు శోభ, మార్త, ల్యాబ్ టెక్నీషియన్ అజీజ్ ఖాన్, ఎంఎల్ హెచ్ పీ లు సుమలత, రజిత, స్రవంతి, హెల్త్ అసిస్టెంట్లు గఫూర్, ఇసాక్ అహ్మద్ వేణు, ఏఎన్ఎంలు తిరుమల, మంకుబాయి, యేసువర, విజయదర్శిని, చిలుకమ్మ, నర్సమ్మ, సారాజ్యోతి, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.



## ఈ నెల 26న మెగా జాబ్ మేళా

### సింగరేణి ఏరియా జిఎం రాధాకృష్ణ



**మందమర్రి, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
కోల్ బెల్ట్ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 26న బెల్లంపల్లి పట్టణంలో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ తెలిపారు. పట్టణంలోని జీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంపల్లిలోని ఎంసీ గ్రౌండ్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ, నోబుల్ ఎంపవర్‌మెంట్, వారిచే సంయుక్తంగా మెగా జాబ్ మేళా-2025ను నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఈ జాబ్ మేళాకు, కోల్ బెల్ట్ ప్రాంతాలైన మందమర్రి, బెల్లంపల్లి, పరిసర ప్రాంతాలలోని సుమారు 7 వేల మంది నిరుద్యోగ యువత హాజరయ్యే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో దాదాపు 70 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, నిరుద్యోగ యువత ప్రయోజనం పొందే దిశగా ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ముఖ్యంగా మ్యానుఫ్యాక్చరింగ్, రిటైల్, ఐటి, నాన్ ఐటి, డిజిటల్ మార్కెటింగ్, సర్వీస్ సెంటర్లకు చెందిన ప్రముఖ సంస్థలలో నియమాకాలు చేపట్టనున్నామని, సాధ్యమైనంత వరకు అదే రోజు నియామక పత్రాలు అందే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామిల సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా వారి సొంత ప్రాంతంలోనే వివిధ రంగాల ప్రముఖ కంపెనీలో ఉద్యోగాలు పొందేలా ఈ వేదికను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీని ద్వారా స్థానిక యువత ఉజ్వల భవిష్యత్తుకు పునాది పడుతుందని ఆశిస్తున్నట్లు, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఐఈడి ఎస్ఈ కిరణ్ కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, శోభన్ బాబు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలను పరిష్కరించండి

■ మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే పాయల్ వినతి



**ఆదిలాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ విన్నవించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతి పత్రం ఇచ్చారు. సోయాబీన్ పంటకు ప్రభుత్వమే కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే కోరారు. రైతులు మార్కెట్లో తక్కువ ధరలకు అమ్మతున్నారనీ, ప్రస్తుతం రైతులు క్వింటాల్కు రూ.1200 రూ.1500 వరకు నష్టపోతున్నారన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంట నష్టపోయి న రైతులకు బెంగాల్ గ్రామ్ విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. పత్తి అమ్మకాలకు వచ్చే రైతులు గంటల కొద్దీ వేచిచూసే పరిస్థితి ఉందనీ, అందువల్ల రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డ్‌లో రైతులకు ఆహారం పంపిణీ చేయాలన్నారు. రైతుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పాయల్ పేర్కొన్నారు.

## గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని వినతి

**తిర్యాణి, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**
మండలం గోపెర గ్రామపంచాయతీలోని సమస్యలు పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్‌కు బుధవారం గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. పూన గూడ నుంచి మోడీ గూడ వరకు రోడ్డు, షెడ్ మంజూరు, తాగునీరు, పారిశుధ్యం సమస్యలు పరిష్కారం చేయాలన్నారు.





## రైతుల సంక్షేమానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత

■ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

■ ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

**ఇంద్రవెల్లి, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులు తాము పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని తెలిపారు. రసాయన ఎరువుల, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ ఎరువులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యామల దేవీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఉత్తం, పీఏసీఎస్ ఛైర్మన్ డోంగ్రే మారుతి, వ్యవసాయ అధికారి గణేశ్, తహసీల్దార్ ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జహీర్, మార్క ఫెడ్ అధికారులు, పిఏసీఎస్ అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలలో అవగాహన సదస్సు



**నిర్మల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం వైఆర్‌జీ కేర్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ రహిత ప్రపంచం పై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో ఎయిడ్స్‌పై వివరించారు. ఎయిడ్స్‌కు మందు లేదు కేవలం నివారణ మాత్రమే ఎయిడ్స్ సోకిన వారు ఎవరూ కూడా అధైర్యపడకూడదన్నారు. రోగుల పట్ల వివక్షత చూపవద్దని, ఎయిడ్స్ పట్ల ప్రజలకు అపోహలు, అనుమానాలు తొలగించాలన్నారు. వివరాలకు ఎయిడ్స్ హెల్ఫ్ లైన్ నంబర్ 1097 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయగలరు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ శశిమాల, శశికళ, గీత ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు సంతోష్ ఉపాధ్యాయులు రాజేందర్, చట్ల శ్రీనివాస్, సురేందర్, మసియుద్దిన్, సత్తయ్య, ఆశా కిరణ్, విద్యారాణి, సునీత, ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.

## జన్నారం బీజైవైఎం మండల అధ్యక్షుడిగా రమేష్

**జన్నారం, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**



జన్నారం, మండల నూతన బీజేవైఎం అధ్యక్షులుగా జన్నారం మండలం దేవుని గూడకు చెందిన కందుల రమేష్‌ను నియమించినట్లు బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీకి ఆయన చేసిన సేవలను, పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ పదవి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు.

# విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించొద్దు

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య - తహసీల్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

**తాండూర్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**



విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని అదనపు కలెక్టర్ చంద్రయ్య సిబ్బందికి సూచించారు. మండలంలోని తహసీల్ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన కార్యాలయానికి వచ్చిన సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో కొంచెం సేపు వేచి ఉన్న అనంతరం అధికారులు రావడంతో రికార్డులు తనిఖీ చేశారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కిష్టంపేట గ్రామానికి చెందిన ఆదివాసి కొలవార్‌కు చెందిన రైతులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వెంకయ్య పల్లి శివారులోని సర్వే నెంబర్ 12లో గల 34 ఎకరాల భూమిని మూడు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నామని అటవీ శాఖ అధికారులు ఆ భూమిని సాగు చేయ వద్దంటూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమకు పోడు పట్టాలు వచ్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించి స్థానిక అధికారులతో విచారణ చేయిస్తానన్నారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ జ్యోష్న, సిబ్బంది ఉన్నారు.

## కొమరం భీమ్ స్ఫూర్తిని కొనసాగిద్దాం

**జన్నారం, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**



జల్, జంగిల్, జమీన్ నినాదంతో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ధీరుడు. ఆదివాసుల ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పిన యోధుడు స్వేచ్ఛ సమానత్వం కోసం ప్రాణాలను అర్పించిన మహనీయుడు గోండుల గుండె ధైర్యం ఆదివాసుల ఆరాధ్య దైవం కొమురం భీమ్ అని జన్నారం ఎఎంసి ఛైర్మన్ దుర్గమ్మ లక్ష్మీనారాయణ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ అన్నారు. బుధవారం కొమరం భీం జయంతి సందర్భంగా మండలంలోని ఇంధన్ పల్లి చౌరస్తా వద్ద ఉన్న కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కొమరం భీం అడుగుజాడల్లో నడుస్తూ అతని ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఇసాక్, మామిడిపల్లి ఇందయ్య, కంటెం శంకర్, అజ్మీరా నందు నాయక్, ముత్యం సతీష్, రియాసత్ అలీ, బాదావత్ సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి ప్రాణాలు తీసిన విద్యుత్ కంచె



**ఖానాపూర్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

పొలంలో అమర్చిన విద్యుత్తు రక్షణ కంచెకు తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ఖానాపూర్ మండలంలోని బీర్‌నంది పంచాయతీ పరిధి తుమ్మగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్నూరు మండలం నాగల కొండ పంచాయతీ పరిధి దేవారిగూడ గ్రామానికి చెందిన గజానంద్ (30) తన భార్య యమున, ముగ్గురు పిల్లలతో కలిసి తుమ్మగూడెంకు 20 రోజుల క్రితం వచ్చారు. ఇక్కడే ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. మంగళవారం దండారి ఉత్సవాలను చూసేందుకు యమున పిల్లలను తీసుకుని గంగాపూర్ గ్రామానికి వెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి భర్త కనిపించకపోవడంతో వెతికారు. ఉదయం గ్రామ శివారులోని ఓ పంట పొలంలో గజానంద్ మృతదేహాన్ని గుర్తించారు. పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు రక్షణ తీగ తగిలి అతడు చనిపోయినట్లు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

## సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలి



**తాండూర్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

ఈనెల 24,25వ తేదీల్లో మహబూబాబాద్ జిల్లాలో జరుగనున్న రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగాం రాజారాం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ మహాసభకు సీఐటీయూ అఖిలభారత కోశాధికారి సాయిబాబు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపాలడుగు భాస్కర్ హాజరవుతారని అన్నారు. గ్రామాల పరిశుభ్రతలో ముందు వరుసలో ఉండే పంచాయతీ కార్మికుల సమస్యల గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సకాలంలో వేతనాలు అందించక ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మరో వైపు అధికారులు అధిక పని భారం మోపుతూ తొలగిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతుండడం శోచనీయమని అన్నారు. మహాసభల్లో గతంలో చేసిన పోరాటాలను సమీక్షించుకొని, భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తూ తీర్మానిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ అకలా అలీ, బాబా అక్బర్, హంసరాజు, రాజయ్య ,కార్మికులు పాల్గొన్నారు.



## రోడ్డు ఎక్కిన సోయా రైతన్నలు

**బోథ్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సోయా రైతులు ధర్నా చేపట్టారు సోయా పంట చేతి కొచ్చి స్థానిక మార్కెట్ యార్డ్ లో తేమ శాతం లేకుండా ఆరబెట్టినా అంతే కాకుండా మార్కెట్ యార్డు లో సోయా పంట నిల్వలు పేరుకపోయాయని కనీసం మార్కెట్ యార్డ్‌లో కూడా సోయా పంట తీసుకువద్దమన్న స్థలం లేదని ప్రభుత్వం ఒకపక్క రైతు ప్రభుత్వం అంటూ మోసాలు చేస్తుందని తక్షణమే సోయా పంట ను కొనుగోలు చేయాలని రైతులు డైమండ్ చేశారు మాజీ ఎంపిపి తుల శ్రీనివాస్ మాట్లాడుతూ సోయా పంట కొనుగోలు చేయాలని అదే విధంగా అకాల వర్షాల వల్ల పంట దిగుబడి రాలేదని నష్ట పోయిన ప్రతి రైతుకు పదివేల రూపాయల సహాయం తో పాటు వరి పంట కు ఏవిధంగా అయితే 500 రూపాయలు బోనస్ ఇస్తుందో అదే విధంగా మా ప్రాంతంలో పండిస్తున్న , పత్తి,సోయా, మొక్క జొన్న, కందులు, పెసర్లు, మినుములకు కూడా 500 రూపాయలు బోనస్ ప్రకటించాలని అన్నారు రెండు మూడు రోజుల్లో సోయా పంట కొనుగోళ్లు జరపాలని లేని పక్షంలో రైతులందరం ఏకమై ఉద్యమాలు చేస్తామని అన్నారు ఈ ధర్నా కార్యక్రమం లో బోథ్ మండల రైతులు, ఇట్టేడి మోహన్ రెడ్డి, బోడ్డు శ్రీనివాస్, కొట్టాల రమేష్ రెడ్డి, సోమ్ శంకర్, రాజారాం, చాంద్ బాషా, రైతు వేదిక అధ్యక్షుడు బొర్రన్న, శ్రీదర్ రెడ్డి, అల్లకొండ ప్రశాంత్, స్థానిక బి ఆర్ ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రతీగింజను కొనుగోలు చేస్తాం

**సిరికొండ, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

రైతులు అధైర్యపడొద్దని, ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి మక్కలు తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు. బుధవారం అదనపు కలెక్టర్ సిరికొండ మండలంలో పర్యటించి తడిసిన మక్కలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అధైర్యపడొద్దని, ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రతీ గింజను కోనుగోలు చేస్తుందని ధైర్యం చెప్పారు. ఆమె వెంట తహసీల్దార్ తుకారాం, రెవెన్యూ అధికారులున్నారు.





## సంస్కృతి, సాంప్రదాయాలను
# భావితరాలకు అందించాలి

**నార్నూర్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

ఆదివాసి సంస్కృతి, సాంప్రదాయాలు గొప్పవని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం జామడ గ్రామంలో నిర్వహించిన దండారి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. గుస్సాడీలకు, ఆదివాసి మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసులు నిర్వహించే ప్రతి పండుగకు ఒక ప్రత్యేకత ఉంటుంద న్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, కో-ఆప్షన్ సభ్యుడు ఉద్ధవ్ కాంబ్లే, మండల అధ్యక్షుడు మెస్రం హన్మంతరావు, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం, చౌహన్ యశ్వంత్, గ్రామ పెద్దలు, మహిళలు ఉన్నారు.

## తప్పుడు ప్రచారాలు చేసిన
# వారిపై చర్యలు తప్పవు
### ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి

**ఆదిలాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**



తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి బుధవారం తెలిపారు. మొబైల్ ఫోన్లలో మహిళల న్యూడ్ ఫోటోలు ఉన్నాయంటూ అసత్య ప్రచారం చేసిన వారిపై పేర్కొన్నారు. సోషల్ మీడియాలో, నేరుగా గానీ బాధింపబడినట్లైతే, వేధింపులకు గురైనట్లయితే, బ్లాక్ మెయిల్‌కి గురైనట్లయితే మహిళలు నిర్భయంగా జిల్లా పోలీసులను సంప్రదించాలని సూచించారు. రెండు రోజుల క్రితం మావల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కేసులో ఎవరైనా దుష్ప్రచారాలు చేసిన మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తప్పవని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. వ్యక్తుల మొబైల్ ఫోన్లలో ఎలాంటి మహిళల అస్లీల ఫోటోలు ఉన్నాయంటూ సోషల్ మీడియా నందు లేదా వాట్సాప్‌లో దుష్ప్రచారం చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. మహిళలు లేదా బాధితులు ఎవరి కారణంగానైనా బాధింపబడినట్లైతే నిర్భయంగా జిల్లా పోలీసులు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని ఫిర్యాదులు చేయవచ్చని వారిపై కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు. మహిళల న్యూడ్ ఫోటోలు మొబైల్ ఫోన్‌లో ఉన్నాయని విషయం అవాస్తవం, వాటిని పూర్తిగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. మహిళలు ఎవరి చేత అయిన సోషల్ మీడియాలో గానీ, నేరుగా గానీ బాధింపబడినట్లైతే, వేధింపులకు గురైనట్లయితే, బ్లాక్ మెయిల్‌కి గురైనట్లయితే పోలీసులను సంప్రదించాలని, నేరస్థలను గుర్తించి చట్ట ప్రకారం చర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు. వివరాలను గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఈ విషయంపై వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరైనా ధర్నాలకు ఎలాంటి నిరసన కార్యక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

# బైక్ దొంగకు ఆరు నెలల జైలు శిక్ష

**మంచిర్యాల, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

బైక్ దొంగతనానికి పాల్పడిన ఒక రికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.100ల జరిమానా విధిస్తూ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, జూనియర్ సివిల్ జడ్జి కే. నిరోష బుధ వారం తీర్పు వెల్లడించినట్లు స్థానిక సీఐ ప్రమోద్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. జిల్లా కేంద్రంలోని ముఖరాం చౌరస్తా కాలనీకి చెందిన భరత్ రేన్వాకు చెందిన స్కూటీని 2025 జూన్ 11న స్థానిక సూర్యనగర్కు చెందిన గుండేటి రాకేశ్ దొంగతనం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పర్చగా, విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో రాకేశ్కు ఆరునెలల జైలు శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

# బస్సు ఎక్కిన ప్రయాణికులతో పరిచయం కార్యక్రమం



**నిర్మల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

ప్రయాణికుల సేవే ప్రథమ కర్తవ్యం అంటూ ఆర్టీసీ వినూత్న రీతిలో టీజీ ఆర్టీసీలో కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజలకు భరోసా భద్రత ప్రయాణంపై అవగాహన కల్పించేందుకు శ్రీకారం చుట్టింది. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తర్వాత టీజీ ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడం ఆదాయ వనరులు పెరగడంతో ప్రయాణికుల భద్రతకు కూడా అత్యధిక ప్రాధాన్యమిస్తూ వినూత్న కార్యక్రమాలతో ముందుకు పోతుంది. బుధవారం ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ జిల్లాల్లోని అన్ని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్న భక్తులకు ఆర్టీసీ కండక్టర్లు డ్రైవర్లు స్వాగతం పలికే కార్యక్రమాన్ని చేపట్టింది. నిర్మల్ జిల్లాలో నిర్మల్ బైంసా ఆర్టీసీ డిపోలు ఉండగా సుమారు నిర్మల్‌లో 144, బైంసాలో

### ఆర్టీసీలో మరో వినూత్న కార్యక్రమం

72 ఆర్టీసీ సర్వీసులను నడుపుతున్నారు. అయితే ఆర్టీసీలో విధులు నిర్వహించి కండక్టర్లు డ్రైవ ర్లు డ్యూటీ ఎక్కగానే వారు ప్రయాణించే రూట్లో బస్సులు ఎక్కిన ప్రయాణికులకుస్వాగతంపలికే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు

**స్వాగతం.. సుస్వాగతం అంటూ...**

టీజీ ఆర్టీసీలో ప్రయాణికులకు మరింత దగ్గర ఎందుకు ఇప్పటికి ప్రతి శుక్రవారం పువ్వులు ఇచ్చి మర్యాద దినోత్సవాన్ని పాటిస్తున్న టీజీ ఆర్టీసీ అధికారులు తాజాగా ప్రతిరోజు స్వాగత కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. డిపో పరిధిలోని వివిధ రూట్‌లకు వెళ్తున్న బస్సుల్లో విధులు నిర్వహిస్తున్న కండక్టర్లు డ్రైవర్లు బస్సు ఎక్కిన ప్రయాణికులకు స్వాగతం సుస్వాగతం అంటూ పరిచయ కార్యక్రమాన్ని చేసుకోనున్నారు. ఆ తర్వాత కండక్టర్ డ్రైవర్ తమ పేర్లను పరిచయం చేసుకొని ఆ సర్వీసు నిర్మల్ నుండి ప్రారంభమై ఎక్కడికి వెళ్తుంది ఏ సమయానికి వెళ్తుంది అక్కడ చేరుకోవడానికి సమయం ఎంత ఆగే స్టేజీలు టికెట్ల ధరలు ఆర్టీసీ సంక్షేమ పథకాలు తదితర వివరాలను బస్సులోనే వివరించి తర్వాత ప్రయాణం సాగించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. టీజీ ఆర్టీసీలో తాము ఎన్ని రోజుల నుంచి పనిచేస్తున్నాం డ్రైవర్ అనుభవం కండక్టర్ అనుభవం తదితర అంశాలను ప్రయాణికులకు వివరించారు. ఆర్టీసీ ద్వారా అందుతున్న సేవలను ప్రయాణికులకు వివరించి ఆర్టీసీ ప్రయాణం భరోసా భద్రతతో కూడుకుందని ప్రయాణికులకు నమ్మకంగా వివరిస్తూ మీ ప్రయాణం సుఖంగా ప్రశాంతంగా నిర్వహించాలని టీజీ ఆర్టీసీ కోరుకుంటున్నారు. ప్రచారం ముగించే విధంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లాలోని అన్ని సర్వీసులో ఈ కార్యక్రమం ప్రతిరోజు అమలు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవడంతో ప్రయాణీకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ టోల్ ఫ్రీ నెంబర్ ఇతర సేవలపై కూడా అవగాహన కల్పించడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

### ప్రయాణికులకు పూర్తి భరోసా..

టీజీ ఆర్టీసీలో ప్రయాణం చేసే ప్రయాణికులకు భద్రతా భరోసా మర్యాద కల్పించే విధంగా పరిచయ కార్యక్రమం స్వాగత కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు నిర్మల్ డిఎం పండరీ తెలిపారు. ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి ఆదేశాల బుధవారం నిర్మల్ డిపోలో కండక్టర్ డ్రైవర్లకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించి అమలు అయ్యేలా చర్యలు తీసుకున్నాం ప్రయాణికులు కూడా తమకు పూర్తి సహకారం అందించాలి. **-పండరి, నిర్మల్ డీఎం**

# సోయా రైతులకు అండగా ఉంటాం

**బోథ్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి తెలిపారు గత కొన్ని రోజులుగా బోథ్, ఇచ్చోడ, ఆదిలాబాద్ మార్కెట్ యార్డులలో సోయా ధాన్యాన్ని ఆరబెడుతున్నారని త్వరగా కొనుగోలు చేయాలని, వర్షం ద్వారా రంగు మారిన, నానిపోయిన ధాన్యాన్ని, అధిక మొత్తంలో దిగుబడి ఉండడం వల్ల ఒక ఎకరానికి 12 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని రైతుల కోరడంతో అదిలాబాద్ జిల్లా కలెక్టర్, మార్క్ ఫేడ్ డిఎం, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు సమాచారం అందించి త్వరలో సోయాబీన్ కొనుగోలు చేయాలని కోరారు రెండు మూడు రోజుల్లో సోయాబీన్ పూర్తిస్థాయి కొనుగోలు



షెడ్యూలు విడుదల చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి కార్యాలయం తెలిపిందని అన్నారు కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# పట్ట పగలే చోరీ
## బంగారం, నగదు అపహరణ

**తాంసి, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

మండలంలో పట్ట పగలు ఆలయంలో దొంగ తనం కల కలం రేపుతోంది. ఎస్సై జీవన్ రెడ్డి వివరాల ప్రకారం మండలంలోని బోడ గుట్ట వద్ద గల దుర్గమ్మ ఆలయంలో బుధవారం మధ్యాన్నం గుర్తు తెలియని దుండగులు ఆలయ తాళం ధ్వంసం చేసి మూడు గ్రాముల బంగారం, రూ. వెయ్యి నగదును అపహరించారని వాటి విలువ రూ. 10 వేల ఉంటుందని అన్నారు. గమనించిన స్థానికులు ఆలయ పూజారి పొచ్చన్న సమాచారం అందిం చడంతో వెంటనే డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిం చారు.పూజారి పొచ్చన్న పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవన్ రెడ్డి తెలిపారు.

## ఎరువుల దుకాణాల డీలర్లు
# నిబంధనలు పాటించాలి

**చింతలమానేపల్లి, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

ఫర్టిలైజర్, ఎరువుల దుకాణాల డీలర్లు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) వెంకటి అన్నారు. మండలంలోని రణవెల్లి, రవీంద్రనగర్, చింతలమానెపల్లి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, నిల్వలు పరిశీలించారు. డీఏవో మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పురుగుమందులు వాడే విధానం లేబుళ్లపై ముద్రించి ఉంటుందని, రైతులు గమనించాలని సూచించారు. నకిలీ పురుగు మందులు విక్రయించినా, నిలువ ఉంచినా చర్యలు తప్పవని హెచ్చరించారు.





# వైద్యసేవలు మెరుగుపర్చాలి

**గుడిహత్నూర్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

వైద్యసేవలు మెరుగుపర్చడంతో పాటు ఆసుపత్రుల్లో ఉన్న వైద్య ఉపకరణాలు వినియోగంలో ఉండేలా చూడాలని డిప్యూటీ డీఎంహెచ్ సాధన సూచించారు. స్థానిక పీహెచ్‌సీని బుధవారం సందర్శించారు. ప్రసూతిగది, ల్యాబ్‌లో ఉన్న పరికరాలతో పాటు అందుబాటులో ఉన్న మందులు, ఎన్సీడీ, ఏఎన్సీ, టీబీ, వ్యాక్సినేషన్ రికార్డులు పరిశీలించి సి బ్బందికి పలు సూచనలు చేశారు. ఈ నెల 29 న వరల్డ్ బ్యాంకు ప్రతినిధులు స్థానిక పీహెచ్‌సీని సందర్శించనున్నారని ఈ మేరకు అన్ని రికార్డులతో పాటు ఉపకరణాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. అందిస్తున్న సేవలను స్థానిక వైద్యాధికారి శ్యాంసుందరన్ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి జాదవ్ దేవిదాస్ నాయక్, క్వాలిటీ మేనేజర్ అమర్, డీడీఎం రమణ ఉన్నారు.

# తనిఖీలకు మంగళం..?

- జాతీయ రహదారులపై చెక్‌పోస్టుల తొలగింపు
- అధికారికంగా మూసివేత..
- రికార్డులు, సామగ్రి జిల్లా కేంద్రానికి తరలింపు...
- 2014లో ప్రారంభం.. 2025లో ఎత్తివేత
- అవినీతి ఆరోపణలే ప్రధాన కారణం
- సాయంత్రానికి తట్టా బుట్ట సర్దిన అధికారులు

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

ఆయా రాష్ట్రాల మధ్య జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ప్రభుత్వం ఎత్తేసింది. నియమ నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా వస్తువులు, ఆహార ధాన్యాలు, ఇతర ప్రమాద కరమత్తు పదార్థాలు, మద్యం సరఫరాకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో దశాబ్దం కింద వాటిని ఏర్పాటుచే శారు. కాగా, ఆ చెక్ పోస్టులు కేవలం కలెక్షన్ కేంద్రాలుగా మారిన అంశాన్ని ప్రభుత్వం సీరియస్గా తీసుకుంది. దీంతో వాటిని తక్షణమే మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న చెక్ పోస్టులు ఎట్టకేలకు మూతపడ్డాయి. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రంలోకి అడుగుపెట్టే క్రమంలో అక్రమ రవాణా జరగకూడదనే ఉద్దేశంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఆదిలాబాద్, నిర్మల్ ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్న చెక్ పోస్టులు ప్రధానంగా పనిచేసేవి. అనధికారికంగా మరికొన్ని చోట్ల కూడా అక్రమ రవాణా పేరుతో అధికారులు మరికొన్ని చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిర్వహిస్తూ వచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చెక్ పోస్టులలోనే కాకుండా.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టుల వల్ల ప్రభుత్వానికి ప్రయోజనం లేకపోగా అధికారులు, ప్రైవేటు వ్యక్తులు పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారనే విషయాలు స్పష్టం అయ్యాయి. ఈ కారణంగానే చెక్ పోస్టులను వెంటనే తొలగించాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ కావడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సంబంధిత రవాణాశాఖ అధికారులు, సిబ్బంది చెక్ పోస్టులను ఎత్తి వేశారు. ఆయా చెక్ పోస్టుల వద్ద ఉన్న ఫర్నీచర్, రికార్డులను ప్రత్యేక వాహనాలలో ఆయా జిల్లాల ఆర్టీవో కార్యా లయాలకు తరలించారు.

**9 ఏళ్లుగా దోపిడీ...**

చెక్ పోస్టుల పేరుతో.. రవాణాశాఖ అధికారులు, ఏకంగా ప్రైవేటు వ్యక్తులను నియమించుకొని వసూళ్లకు పాల్పడుతున్న విషయం ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిసిన విషయమే. దీంతో రోజు కలెక్షన్లలో ఎవరికి ఎంతెంత వాటా దక్కాలో ముందుగానే నిర్ణయించుకోవ డంతో చెక్ పోస్టులు కొనసాగాయి. అధికారులు, సిబ్బంది నెల జీతం కన్నా ఎక్కువ డబ్బులు సంపాదించారు. ఈ విషయమై గతంలో ఆయా చెక్ పోస్టుల వద్ద జరిగిన ఏసీబీ అధికారులు దాడులు నిరూపించాయి కూడా. గత ఆదివారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీఏ చెక్ పోస్టులపై ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. తెలంగాణ రవాణా శాఖ సరిహద్దు చెక్ పోస్టులపై ఏసీబీ అధికారులు మెరుపు దాడులతో హడలెత్తించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారే వరకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న బోరజ్, బేల్ తరోడా, వాంకిడి రవాణా శాఖ చెక్‌పోస్ట్ లపై ఏకకాలంలో దాడులు నిర్వహించి లెక్కకు మించి వాహనాల నుండి డబ్బులు వసూలు చేస్తున్న సిబ్బందిపై కేసులు నమోదు చేశారు. బోరోజ్ చెక్‌పోస్టు వద్ద ప్రైవేట్ సిబ్బంది మహారాష్ట్ర నుండి వచ్చే లారీల నుండి డబ్బులు వసూలు చేస్తుండగా ఏసీబీ దాడి చేసి రూ. లక్షా 26 వేల నగదును, నిర్మల్ జిల్లా బేల్ తరోడా వద్ద లెక్కకు మించి డబ్బులు వసూలు చేసిన రూ. 13 వేలు, కొమరం భీం జిల్లా వాంకిడి చెక్ పోస్ట్ వద్ద రూ. 5,100 నగదును సీజ్ చేశారు. రవాణాశాఖ అధికారులు ప్రైవేట్ సిబ్బందినీ నియమించుకొని పరిమితిని మించి అధికలోడుతో వెళ్తున్న లారీల నుండి పర్మిట్ వసూళు చేస్తున్నట్టు తెలిసింది. ఆరు నెలల వ్యవధిలో అంతరాష్ట్ర చెక్‌పోస్టులపై ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడం ఇది రెండవసారి.

**వాహనదారుల హర్షం...**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న చెక్ పోస్టులను ప్రభుత్వం వెంటనే ఎత్తి వేసేందుకు చర్యలు చేపట్టిన నేపథ్యంలో సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. వాహనాల యజమానులు, సిబ్బంది వసూళ్ల బాధల నుంచి తమకు విముక్తి కల్పించినందుకు పలువురు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

**ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బాధ్యతలు...**

అక్రమ రవాణాను ఆయా రాష్ట్రాల మధ్య అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలను ఏర్పాటు చేసే




అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ టీంలు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణా చేస్తున్న వారు, వాహనాలపై కఠినంగా చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

**కార్యాలయాల్లో ఏజెంట్ల హవా**

ఉమ్మడి జిల్లా పరిధిలో ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయాల్లోనూ ఏజెంట్లు, మధ్యవర్తుల హవా కొనసాగుతోందనే ఆరోపణలున్నాయి. ఏజెంట్ల పేరుతో వాస్తవ చార్జీల కంటే అధికంగా వసూళ్లు చేస్తున్నారు. ఆర్టీఏ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది అంతా తెలిసి కూడా ఈ అనధికార వసూళ్లను ప్రోత్సహిస్తున్నారు. కార్యాలయాలకు వచ్చే వాహనదారులు, వినియోగదారులు లైసెన్స్, రిజిస్ట్రేషన్లు, పర్మిట్లు ఇవ్వడంలో ప్రభుత్వం విధించిన రుసుం, పన్నుల కంటే అధికంగా చెల్లించాల్సిన అవసరం ఏర్పడుతోంది. చాలామందికి రవాణా శాఖ నిబంధనలపై అవగాహన లేమితో విద్యావంతులు సైతం మధ్యవర్తులతోనే కార్యాలయాలకు వెళ్తున్నారు. చాలా సేవలు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. సులువుగా పని పూర్తవుతుందనే కారణంతో ఏజెంట్లను ఆశ్రయిస్తున్న పౌరులపై అదనపు భారం పడుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వం వాహన రిజిస్ట్రేషన్లు షోరూంల్లోనే చేసుకునే వెలుసుబాటు ఇవ్వాలి. నిరక్షరాస్యులు సైతం కార్యాలయాల్లో సేవలు పొందేలా ఏర్పాట్లు, కార్యాలయాల్లో మధ్యవర్తులను కట్టడి చేస్తే అవినీతి తగ్గే అవకాశం ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఆధునిక సేవలను వినియోగించి దళారులు వ్యవస్థను తగ్గిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్న నేపథ్యంలో ఆ దిశగా ఉమ్మడి జిల్లా కార్యాలయాల్లో పకడ్బందీగా అమలు చేస్తే అక్రమ వసూళ్లు నిలిచే అవకాశం ఉంటుంది.

నిర్మల్ జిల్లా ముథోల్ తానూరు మండలంలోని బెల్‌తరోడా చెకోపోస్టులోని ఫర్నిఛర్‌ను నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయానికి తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో అధికారులు, సిబ్బంది ఫర్నిచర్‌తో పాటు కంప్యూటర్లు, ఫైళ్లు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. చెక్‌పోస్టును ఎత్తివేసినట్లు బ్యానర్ ఏర్పాటు చేశారు.

**ఫైళ్లు తరలింపు..**

అధికారులు ఆఘమేఘాల మీద బోరజ్ చెక్‌పోస్టు వద్ద కార్యకలాపాలు నిలిపివేశారు. బోర్డులు, బారికేడ్లు తొలగించారు. కంప్యూటర్లు, రశీదులు, ఆర్థిక పరిపరమైన రికార్డులను డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాని(డీటీసీ)కి తరలించారు. నలుగురు ఎంవీఐలు, ఆరుగురు ఏఎంవీఐలు, ముగ్గురు కానిస్టేబుళ్లు, నలుగురు హోంగార్డులు, ముగ్గురు కార్యాలయ సిబ్బంది పని చేస్తున్నారు. వీరు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించే వారు. వీరిని డీటీసీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఇక నుంచి వీరికి ఇతర బాధ్యతలు అప్పగించనున్నారు.

**కమిషనర్ ఆదేశాల మేరకు తొలగింపు...**

రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వాంకిడి రవాణా చెక్‌పెస్టును బుధవారం సాయంత్రం 5 గంటలకు తొలగించాం. చెక్‌పెస్టులో ఉన్న కంప్యూటర్లు, రికార్డులను జిల్లా కార్యాలయానికి తరలిస్తాం. ఇకపై ఇక్కడ రవాణా శాఖ సిబ్బంది ఎవరూ పనిచేయరు. ఎవరైనా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా డీటీవో రాంచందర్ తెలిపారు.

**ఆన్‌లైన్‌లో సేవలు..**

వాంకిడి చెక్‌పోస్టు ద్వారా అందించిన సేవలను ఇకపై www. transport. telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు. ఆన్‌లైన్ సర్వీసెస్ అనే ఆప్షన్ ద్వారా టెంపరరీ పర్మిట్, వాలంటరీ టాక్స్, స్పెషల్ పర్మిట్ వంటి సేవలు లభ్యమవుతాయి. సేవలపై చెకోపోస్ట్ సిబ్బంది కొన్ని నెలలుగా వాహనదారులకు అవగాహన కల్పించడంతోపాటు చెకోపోస్టు వద్ద ప్రత్యేకంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

## చెరువులో దూకి వృద్ధుడు ఆత్మహత్య

**ముథోల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

మండలంలోని కుంసర గ్రామానికి చెందిన భుజంగ రావు(75) అనే వృద్ధుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భుజంగ్ రావు గత కొంత కాలంగా ఆస్తమా వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో భరించలేక బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి చెరువులో దూకాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యు లకు అప్పగించారు. భుజంగ్ రావు కూతురు నాగ మణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## ముగ్గురు వ్యక్తులపై కేసు

**ఆదిలాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో గల పేపర్ ప్లేట్ల షాపులోకి వెళ్లి గందరగోళం సృష్టించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి నట్లు వన్ టౌన్ ఎస్సై రమ్య తెలిపారు. మంగళ వారం మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు షాపులోకి చొరబడి వస్తువులను చిందరవందరగా పడేశారని బాధితుడు మహేందర్ వాపోయారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గిరిజన హాస్టల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

**ఆదిలాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

గిరిజన హాస్టల్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని జీవో 64 ను రద్దు చేసి కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, బెస్ట్ అవలేబుల్ ఫీజు బకాయిలను చెల్లించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) సంఘం నాయకులు కోరారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే జులకంటి రంగారెడ్డి, ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ రాష్ట్ర సచివాలయం లో కలిసి వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 43 రోజులుగా గిరిజన వర్కర్స్ సమ్మె లో ఉండటం మూలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. బెస్ట్ అవలేబుల్ ఫీజు బకాయిలను పూర్తి స్థాయి లో చెల్లించాలని కోరారు ఈ విషయంలో మంత్రి సానుకూలంగా స్పందించారు. రేపు సంబంధిత అధికారులు, వర్కర్స్ నాయకత్వం తో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో హాస్టల్ డైలీ వేజ్ మరి అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు బి మధు, ఎం పాపారావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రజినికాంత్ ఉన్నారు.



## సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సదర్

### భైంసా పట్టణంలో ఆకట్టుకున్న సదర్ వేడుకలు

**ముథల్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

యాదవుల సంస్కృతి సంప్రదాయాలకు సదర్ పండుగ ప్రతీక అని యాదవ, మున్నూరుకాపు సంఘం నాయకులు అన్నారు. ఈ పండుగను రాబోయే రోజుల్లో మరింత ఘనంగా నిర్వహించి యాదవులు ఐక్యతను చాటిచెప్పాలన్నారు. నిజాం పాలనా కాలంలో నిజాం నవాబు స్వయంగా సదర్ ఉత్సవాలకు హాజరయ్యేవారన్నారు. బుధవారం తెలంగాణ సదర్ సమ్మేళనం, పూజ కార్యక్రమ వేడుకలను భైంసా పట్టణంలో యాదవ, మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో పురాణబజార్‌లో, గణేశనగర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పట్టణ సీఐ జి. గోపినాథ్ హాజరై ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం దున్నలు, గేదెలతో నిర్వహించిన ప్రదర్శనలు అలరించాయి. దున్న రాజుల విన్యాసాలు, యదవుల తీన్మార్ స్టెప్పులతో డప్పుల దరువుకు కళాకారుల నృత్యాలు ఆట పాటలతో పురాణబజార్, గణేశనగర్ దద్దరిల్లింది. యాదవ సోదరులు దున్న రాజులకు పూజలు చేసి వేడుకలను ప్రారం భించారు. వేడుకలను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.









# పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

- రక్తదాన శిబిరానికి భారీ స్పందన
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో మెగా రక్తదాన శిబిరం..
- స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 817 మంది
- రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన జిల్లా ఎస్పీ
- అత్యవసరమైన సమయంలో ప్రాణాలను కాపాడేది రక్తం, రక్తదానం మహోన్నతమైనది...
- రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాల అందజేత

**ఆదిలాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ రక్తదాన శిబిరానికి భారీ ఎత్తున స్పందన లభించిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు ఏర్పాటు చేయబడిన రక్తదాన శిబిరంలో జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని, రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన గావించి, భారీ ఎత్తున ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు భారీ ఎత్తున పాల్గొని అమరవీరుల జ్ఞాపకార్థం వారు చేసిన సేవలను స్మరిస్తూ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ రక్తదాన శిబిరాలలో దాదాపు జిల్లా వ్యాప్తంగా 817 యూనిట్ల రక్తాన్ని పోలీసులు, ప్రజలు, ఔత్సాహికుల రక్తాన్ని రిమ్స్ బ్లడ్ బ్యాంకుకు అందజేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ స్వయంగా రక్తదానాన్ని చేసి సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలవడం జరిగింది. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి జిల్లా ఎస్పీ స్వయంగా ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా అమరవీరుల సమస్మరణ వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, ఒకప్పటి పోలీసులు చేసిన త్యాగాలను జిల్లా ప్రజలకు సవివరంగా వివరించి పోలీసులు చేసే విధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఒకప్పటి అమరవీరుల ప్రాణ త్యాగాల ఫలితమే ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లా ప్రశాంత వాతావరణ కి కారణమని గుర్తు చేశారు. ప్రజలు పోలీసు అమరవీరులను స్మరిస్తూ ఉండాలని తెలిపారు. ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలను మెరుగుపరచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. వృత్తిరీత్యా పోలీసులు ఉన్నతమైన వ్యక్తిత్వ భావాలు కలవారని, వారిని ప్రజలు గౌరవించాలని, రాత్రనకా, పగలనకా, పండుగలు, కుటుంబ సభ్యులను విడిచి, ప్రజా ధన ప్రాణ మాన రక్షణలో 24 గంటలు పోలీసు యంత్రాంగం విధి నిర్వహణలో ఉంటారని తెలిపారు. జిల్లా అభివృద్ధి పథంలో వెళ్లడానికి సంఘవిద్రోహశక్తులు ఆటంకాలుగా మారుతారని, మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి పథంలో తీసుకువెళ్లడానికి సంఘవిద్రవశక్తులతో పోరాడుతూ జిల్లా పోలీసు వ్యవస్థ అహర్నిశలు కృషి చేస్తుందని గుర్తు చేశారు. రక్తదానం శిబిరం పెద్ద ఎత్తున ప్రజలు పోలీసు సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు. రక్తం అనేది జీవితాలను కాపాడడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల దినోత్సవ సందర్భంగా వారి త్యాగాలను గుర్తు చేస్తూ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, డాక్టర్లు, రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ రాథోడ్, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, కమతం ఇంద్రవర్ధన్, పట్టణ సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిమ్స్ సిబ్బంది, ఎన్జీవో నాయకులు, ప్రజలు, యువజన సంఘాలు, ప్రైవేటు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

### ఆరోగ్య పాఠశాల సమీక్షలో కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యపరమైన అలవాట్లను అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఆరోగ్య పాఠశాల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీంసరి పాఠశాల ఉపాధ్యాయుడు నీలం వెంకట్ రచించిన ఇంగ్లీష్ కవితను విద్యార్థులు నేహ, ప్రణవి పఠించారు. విద్యార్థులు ఆరోగ్య పాఠశాల ద్వారా పొందిన ప్రయోజనాలను పాటలు, ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. అలాగే విద్యార్థులకు ప్రశంషా పత్రాలను కలెక్టర్ అందజేశారు. అనంతరం ఆరోగ్య పాఠశాల ఇన్నోవేషన్ ఛాలెంజ్ లో ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు కలెక్టర్ నగదు పురస్కార ప్రొసీడింగ్ ఉత్తర్వులను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతోందని, రక్తహీనత, ఐరన్ మాత్రల ప్రాధాన్యం వంటి అంశాలపై చైతన్యం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రతి నెల పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు సైతం ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మరుగుదొడ్లు లేవని 23 పాఠశాలలను గుర్తించామని, వాటి నిర్మాణానికి ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరులు చేసినట్లు తెలిపారు. విద్యార్థులలో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.విద్యార్థులలో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీంసరి పాఠశాల ఉపాధ్యాయుడు నీలం వెంకట్ రచించిన ఇంగ్లీష్ కవితను విద్యార్థులు నేహ, ప్రణవి పఠించారు. విద్యార్థులు ఆరోగ్య పాఠశాల ద్వారా పొందిన ప్రయోజనాలను పాటలు, ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. అనంతరం ఆరోగ్య పాఠశాల ఇన్నోవేషన్ ఛాలెంజ్లో ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు కలెక్టర్ నగదు పురస్కార ప్రొసీడింగ్ ఉత్తర్వులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య పాఠశాల కోఆర్డినేటర్ అజయ్, కేజీబీవీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.





విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# సేంద్రీయ ఎరువులను వాడాలి

### ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఉట్నూర్, అక్టోబర్ 22 (ప్రభాత సమాచారం)**

రైతులు అందరూ రసాయన ఎరువులను వాడకుండా సేంద్రీయ ఎరువులు వాడకం ద్వారా పంటలు నాణ్యత ఉండటంతో పాటు భూమి సాంద్రత పెరుగుతుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్ రైతు వేదికలో ఎన్ఎఫ్ఎస్ఎం ఆధ్వర్యంలో సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జు పటేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజల కోసం ప్రభుత్వం ఉందని.. పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని, రైతులు పంటల రక్షణ కోసం, అధిక దిగుబడులకు మోతాదుకు మించి ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడడం వల్ల భూసారం కోల్పోయి నష్టపోతున్నారన్నారు. రైతులు సేంద్రియ ఎరువుల వాడకంతో భూముల సారం మరింత పెరుగుతుందన్నారు. అంతకుముందు రైతు వేదిక వద్ద కొమురం భీం జయంతి సందర్భంగా కొమురం భీమ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రమేష్, ఏఈఓలు రవీందర్, జయశ్రీ, సహకార సంఘం చైర్మన్ ఎస్పి రెడ్డి, ఆర్టిఏ జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్, మాజీ సర్పంచ్ జాదవ్ జగదీశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.